ఈనాడు
భద్రాద్రి కొత్తగూడెం

రాష్ట్రస్థాయి ఫొటోగ్రఫీ, షార్ట్‌ఫిల్మ్ పోటీలకు ఆహ్వానం

కొత్తగూడెం నేరవిభాగం, న్యూస్‌టుడే: పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం (ఫ్లాగ్‌డే) సందర్భంగా ఔత్సాహిక ఫొటోగ్రాఫర్లకు షార్ట్ ఫిల్మ్, ఫొటోగ్రఫీ విభాగాల్లో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్పీ రోహిత్ రాజు గురువారం తెలిపారు. పోలీసు అమరవీరుల ప్రాణత్యాగాలను గుర్తుచేసుకుంటూ సంస్మరణ కార్యక్రమాలను సోమవారం చేపట్టనున్నట్లు వివరించారు. మూఢ నమ్మకాలు, సామాజిక రుగ్మతలు, అత్యవసర, ప్రకృతి వైపరీత్యాల సమయంలో పోలీసుల ప్రతిస్పందన, వారి సేవా కీర్తిప్రతిష్ఠలు, సైబర్ నేరాలు, ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, మత్తుపదార్థాల నివారణ తదితర అంశాలపై ఈఏడాది అక్టోబరు నుంచి ఇప్పటివరకు తీసిన మూడు చిత్రాలు, మూడు నిమిషాల నిడివితో షార్ట్ ఫిల్మ్‌లను నామినేషన్లుగా పంపించాలన్నారు. ఆదివారంలోపు జిల్లా పోలీస్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. వివరాలకు 87126 82121 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

పెద్దమ్మ తల్లికి సువర్ణ పుష్పార్చన



పాల్వంచ పట్టణం, న్యూస్‌టుడే: పెద్దమ్మ తల్లికి సువర్ణ పుష్పార్చనను అర్చకులు గురువారం వైభవంగా నిర్వహించారు. ముందుగా అమ్మ వారికి హారతి, మంత్రపుష్పం, నివేదన తదితర పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మ వారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలోని యాగశాలలో చండీహోమం నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్. రజనీకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

వాల్మీకి జీవితం యువతరానికి స్ఫూర్తిదాయకం



వేడుకల్లో పాల్గొన్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్, కలెక్టరేట్ అధికారులు, బీసీ సంఘం నాయకులు

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: రామాయణ మహాకావ్యాన్ని రచించిన వాల్మీకి జీవిత చరిత్ర నేటి యువతకు స్ఫూర్తిదాయకమని కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ అన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో గురువారం వాల్మీకి జయంత్యుత్సవాలు నిర్వహించారు. వాల్మీకి మహర్షి చిత్రపటానికి కలెక్టర్ నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ బోయ కులానికి చెందిన వాల్మీకి రామాయణ మహాకావ్యాన్ని ఎంతో హృద్యంగా రచించారని పేర్కొన్నారు. అందులోని ప్రేమ, త్యాగం, బాధ్యత, రాజ్యపాలన అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. యువత కర్తవ్య బాధ్యతల్ని నెరవేర్చాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్, జిల్లా వెనుకబడిన తరగతుల శాఖ అధికారి ఇ.ఇందిర, కలెక్టరేట్ ఏఓ ఎం.రమాదేవి, బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఎం.వెంకన్న, బి.నందకిశోర్, యు.రాములు, గట్టేశం, కె.సత్యనారాయణ, జి.శ్రీనివాసరావు, సి.హెచ్.శివ, సి.హెచ్.శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రోజుకు పది ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పరిష్కరించండి

జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ అధికారులను ఆదేశించారు. రెవెన్యూ అధికారులతో కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ పంచాయతీ స్థాయిలో పెండింగ్‌లో ఉన్న భూ క్రమబద్ధీకరణ దరఖాస్తుల వివరాలను అందజేయాలన్నారు. రోజుకు కనీసం పది దరఖాస్తులనైనా పరిష్కరించేలా ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. అది ప్రభుత్వ భూమా? కాదా? కోర్టు కేసులు, ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నాయా? అనే వివరాలను విచారణలో పరిశీలించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు డి.వేణుగోపాల్, విద్యాచందన (స్థానిక సంస్థలు), జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

పాఠం వినేదక్కడే.. నిద్రించేదక్కడే..!

పాల్వంచ విద్యావిభాగం, న్యూస్‌టుడే

☆ తొమ్మిది నెలలుగా అద్దె చెల్లించటం లేదంటూ ఖమ్మం నగరంలోని ఓ ఎస్సీ గురుకుల పాఠశాల భవనానికి యజమాని తాళం వేసిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. ఉన్నతాధికారుల హామీ మేరకు తాళం తీశారు.

☆ కొత్తగూడెంలో ఎస్టీ బాలికల డిగ్రీ కళాశాల భవనానికి సక్రమంగా అద్దె చెల్లించటం లేదని యాజమాని ఖాళీ చేయించారు. దిక్కుతోచని పరిస్థితిలో కళాశాలను మరో చోటుకు తరలించాల్సి వచ్చింది. కళాశాలకు సొంత భవనం నిర్మించేందుకు స్థలం కేటాయించినా పనులు చేపట్టకపోవటం గమనార్హం.

గురుకులాలకు ఆదరణ బాగుండటంతో గత ప్రభుత్వం సామాజికవర్గాల వారీగా వీటిని నెలకొల్పింది. నిపుణులు బోధిస్తుండటంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతోంది. అయితే అనేక గురుకులాలు వసతుల లేమితో సతమతమవుతున్నాయి. చాలా విద్యాలయాలు అరకొర సౌకర్యాలు కలిగిన అద్దె భవనాల్లో కొనసాగుతుండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిచోట్ల స్థలాలు కేటాయించినా నిర్మాణ పనులు మొదలుకాలేదు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో అక్కడక్కడ అద్దెలు సకాలంలో చెల్లించకపోవటంతో వాటి యజమానులు తాళాలు వేస్తున్నారు. మరికొన్నిచోట్ల భవన సముదాయాలు అందుబాటులో లేక ఇతర ప్రాంతాలకు గురుకులాలు తరలిపోతున్నాయి.



పాల్వంచలో అద్దె భవనంలో కొనసాగుతున్న ఎస్సీ బాలికల గురుకుల డిగ్రీ కళాశాల

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో..

ఎస్సీ గురుకులాలు: 23
అద్దె భవనాల్లో కొనసాగుతున్నవి: 4
విద్యార్థుల సంఖ్య: 11,550

ఎస్టీ గురుకులాలు: 32
6 13,000

బీసీ గురుకులాలు: 29
27 9,900

మైనార్టీ గురుకులాలు: 16
16 5,268

అద్దె భవనం.. అవస్థల గురుకులం..!

అద్దె భవనాల్లో కొనసాగుతున్న గురుకుల విద్యాలయాల్లోని తరగతి గదుల్లో ఉదయం పూట పాఠాలు వినటం, రాత్రిపూట నిద్రించటం విద్యార్థులకు అలవాటుగా మారింది. అన్నీ ఒకేచోట ఉండటంతో ఇబ్బందులు పడుతున్నారు. నిబంధనల ప్రకారం బోధన ఒకచోట, వసతి మరోచోట ఉండాలి. కొన్నిచోట్ల సొంత భవనాల్లో సకల సౌకర్యాలు కల్పిస్తున్నారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న గురుకులాల్లో మాత్రం క్రీడా మైదానాలు ఉండవు. గురుకులాలకు సొంత భవనాలు, మౌలిక వసతుల కల్పనపై ఉన్నతాధికారులు దృష్టి సారిస్తే వేలాది మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుంది.

అన్ని రకాల ఎస్టీ గురుకుల విద్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. సమస్యలు ఉన్నప్పటికీ సర్దుకుపోతున్నాం. అద్దె భవనాల్లోని గురుకులల్లో విద్యార్థులకు సరిపడా వసతులు లేవు. కొన్నిచోట్ల సొంత భవనాల నిర్మాణానికి ప్రభుత్వం స్థలాలు కేటాయించింది.

– నాగార్జునరావు, ఆర్సీఓ, ఎస్టీ గురుకుల విద్యాలయాలు

విజేతగా రామగుండం రీజియన్ జట్టు

యైటింక్లయిన్‌కాలనీ: 53వ జోనల్ స్థాయి రెస్క్యూ పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్‌గా ఆర్జీ-2, 3 ఏపీఏ జట్టు.. ద్వితీయ స్థానం భూపాలపల్లి, తృతీయ స్థానంలో బెల్లంపల్లి-మందమర్రి జట్లు నిలిచాయి. డ్రిల్ అండ్ పరేడ్‌లో ఆర్జీ-1, థియరీలో ఆర్జీ-2, 3 ఏఎల్‌పీ, ఉత్తమ రెస్క్యూ రిలేలో ఆర్జీ-1, ఉత్తమ నైపుణ్యంలో శ్రీరాంపూర్ డివిజన్, ప్రథమచికిత్సలో మందమర్రి డివిజన్, ఫ్రెష్ ఎయిర్ బేస్‌లో ఇల్లెందు, మణుగూరు, కొత్తగూడెం జట్లు ఉన్నాయి. ఉత్తమ రికవరీలో మందమర్రి, బెల్లంపల్లి, ఉత్తమ రెస్క్యూ రికవరీలో ఆర్జీ-2, 3, ఏపీఏ జట్టు, ఉత్తమ కెప్టెన్‌గా అనిల్‌కుమార్, ద్వితీయ స్థానంలో పూర్ణచందర్ విజేతలుగా నిలిచారు.

రేపు 'ఐలూ' న్యాయవాద శిక్షణ తరగతులు

కొత్తగూడెం న్యాయవిభాగం, న్యూస్‌టుడే: న్యాయవాద శిక్షణ తరగతులను జిల్లా కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ గ్రంథాలయం హాలులో శనివారం నిర్వహిస్తున్నట్లు ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలూ) కమిటీ సభ్యులు రమేశ్‌కుమార్ మక్కడ్, జె.శివరాంప్రసాద్ సంయుక్తంగా గురువారం ప్రకటించారు. ఇటీవల అమలులోకి వచ్చిన మూడు కొత్త చట్టాలకు సంబంధించిన 'ఎలక్ట్రానిక్ ఎవిడెన్స్' అనే అంశంపై హైకోర్టు న్యాయవాది సీవీఎల్ఎన్ మూర్తి అవగాహన కల్పిస్తారన్నారు. 'మహిళల రక్షణ చట్టాల'పై ఖమ్మం న్యాయవాది వి.ఆశయ, 'న్యాయవాదులు-సమస్యల'పై తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు కొల్లి సత్యనారాయణ ప్రసంగిస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని కొత్తగూడెం, భద్రాచలం, ఇల్లెందు, మణుగూరు, దమ్మపేట న్యాయవాదులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చెన్నాపురం-గోరుకొండ మధ్యలో పేలిన మందుపాతర

చర్ల, న్యూస్‌టుడే: చర్ల మండలంలోని చెన్నాపురం-గోరుకొండ మధ్యలో పోలీసులే లక్ష్యంగా మావోయిస్టులు డైరెక్షన్ మైన్(మందుపాతర)ను గురువారం పేల్చారు. ఈ ఘటనలో స్పెషల్ పార్టీకి చెందిన ఓ పోలీసుకు స్వల్ప గాయాలయ్యాయి. సీఐ రాజువర్మ నేతృత్వంలోని పోలీసు బృందం చర్ల మండలం చెన్నాపురం బేస్ క్యాంపునకు వెళ్లి వెనుదిరిగారు. ఈక్రమంలో గోరుకొండకు సుమారు కి.మీ. పరిధిలోని అటవీ మార్గంలో మలుపు వద్ద అంబుష్ వేసిన మావోయిస్టులు ఒక్కసారిగా రహదారి పక్కన పెట్టిన డైరెక్షన్ మైన్‌ను పేల్చారు. దీంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ ఘటనలో స్పెషల్ పార్టీ పోలీసుకు స్వల్పగాయాలయ్యాయి. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని సీఐ రాజువర్మ తెలిపారు.



మావోయిస్టులు మందుపాతర పేల్చిన ప్రాంతం

సర్వేత్రా ససేమిరా..!

ఏఈఓలకు నేడో, రేపో శ్రీముఖాలు జారీ

ఖమ్మం వ్యవసాయం, న్యూస్‌టుడే

డిజిటల్ పంట సర్వే చేపట్టేందుకు వ్యవసాయ విస్తరణాధికారులు(ఏఈఓలు) ససేమిరా అంటున్నారు. సర్వే చేయాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించినా రాష్ట్రవ్యాప్తంగా ఏఈఓలు ముందుకు రావటం లేదు. ఇంత పెద్ద పని తమ ఒక్కరి వల్ల సాధ్యం కాదని మొండికేస్తున్నారు. దీనిని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. విధుల్లో పాల్గొనని ఏఈఓలందరికీ మెమోలు జారీ చేసింది. అయినా స్పందించపోవటంతో నిబంధనల ప్రకారం నేడో, రేపో షోకాజ్ నోటీసులు జారీ చేసే అవకాశముందని విశ్వసనీయ సమాచారం.



రెగ్యులర్ ఏఈఓలు
ఖమ్మం: 113
భద్రాద్రి: 58
ఒప్పంద ఏఈఓలు:
58 09

గైర్హాజరైనట్లు నమోదు..

గతంలో రైతు వేదికలు లేదా తమ క్లస్టర్లలోని కార్యాలయాలకు వెళ్తే ఏఈఓలు హాజరు వేసుకునే అవకాశం ఉండేది. డిజిటల్ క్రాప్ సర్వే అంశం తెరపైకి వచ్చిన తర్వాత ప్రభుత్వం ఈ విధానాన్ని తొలగించింది. డిజిటల్ క్రాప్ సర్వే యాప్ డౌన్‌లోడ్ చేసుకుని లింక్ ద్వారా హాజరు వేసుకునే విధానాన్ని ప్రవేశపెట్టింది. గత పది రోజుల నుంచి ఏఈఓలు సర్వేకు వ్యతిరేకంగా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోకపోవటంతో రాష్ట్రవ్యాప్తంగా ఆయా క్లస్టర్ల ద్వారా వీరు గైర్హాజరైనట్లుగా పరిగణించి జిల్లా అధికారులు రాష్ట్ర అధికారులకు వివరాలు తెలియజేస్తున్నారు. పది రోజుల నుంచి తాము విధులకు హాజరై అన్ని పనులు చేస్తున్నా.. ఒక్క సర్వేలో పాల్గొనకుంటే గైర్హాజరైనట్లు ఎలా పరిగణిస్తారని ఏఈఓల సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు షేక్.నాగుల్ మీరా ప్రశ్నిస్తున్నారు.

ఒప్పంద ఏఈఓల మెడపై కత్తి..

ఒప్పంద ఏఈఓలకు నెలకు కేవలం రూ.16వేల చొప్పున వేతనం అందుతోంది. రెగ్యులర్ ఏఈఓలు సర్వేకు నిరాకరిస్తుండటంతో ఇప్పుడు ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఒప్పంద ఏఈఓలపై దృష్టి సారించింది. డిజిటల్ క్రాప్ సర్వే యాప్‌ను వెంటనే డౌన్‌లోడ్ చేసుకుని సర్వే మొదలుపెట్టకుంటే ఉద్యోగాల నుంచి తొలగిస్తామని హెచ్చరించింది. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని ఒప్పంద ఏఈఓలు సర్వే చేపట్టేందుకు సిద్ధమవటం గమనార్హం.

డిజిటల్ క్రాప్ సర్వే చేపట్టకపోవటంతో ఇప్పటికే ఏఈఓలకు మెమోలు జారీ చేశాం. అయినప్పటికీ వారు సర్వే మొదలుపెట్టకుంటే ప్రభుత్వం చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

- డి.పుల్లయ్య, డీఏఓ, ఖమ్మం

కొత్తవారి కదలికలపై సమాచారమివ్వండి: డీఎస్పీ

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామాల్లో అనుమానాస్పదంగా సంచరించే కొత్త వ్యక్తులపై పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను సూచించారు. మండలంలోని రాజీవ్‌నగర్‌లో గురువారం సీఐ బత్తుల సత్యనారాయణ, ఎస్.ఐ. సూర్య ఆధ్వర్యంలో ఉదయం 5 గంటల కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సరైన పత్రాలు లేని 24 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. హైవే రహదారి చెంతనున్నందున చోరీ వాహనాలను విక్రయించే ప్రయత్నం చేస్తారని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని డీఎస్పీ సూచించారు. మాదక ద్రవ్యాల అనర్థాలపై అవగాహన కల్పించారు.



స్వాధీనం చేసుకున్న వాహనాలతో డీఎస్పీ చంద్రభాను, సీఐ సత్యనారాయణ, ఎస్ఐ సూర్య



స్థానికులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్

రెండు పడక గదుల ఇళ్ల పరిశీలన

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాచలం పట్టణంలో కొంతకాలం క్రితం నిర్మించిన రెండు పడక గదుల ఇళ్లను అదనపు కలెక్టర్ వేణుగోపాల్ గురువారం పరిశీలించారు. అక్కడి పరిస్థితి చూసిన ఆయన ఐటీడీఏ ఇంజినీరింగ్ అధికారులను పిలిచి పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. గిర్దావర్ నర్సింహారావు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాలుగేళ్లు.. 1,425 స్వయం సహాయక సంఘాలు!

సుజాతనగర్, న్యూస్‌టుడే

అతివలు పొదుపు బాటపడితే ఆ కుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకుంటుంది. మహిళా స్వావలంబనే ధ్యేయంగా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) స్వయం సంఘాల (ఎస్‌హెచ్‌జీ) ఏర్పాటుకు నిరంతరం కృషిచేస్తోంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గత నాలుగేళ్లల్లో 1,425 సంఘాలను కొత్తగా ఏర్పాటు చేయడం విశేషం.

జిల్లాలో అత్యధిక మహిళలను పొదుపు సంఘాల్లో సభ్యులుగా చేర్చేందుకు సెర్ప్ నిర్మాణాత్మక చర్యలు చేపడుతోంది. డీపీఎం, ఏపీఎం, సీసీలు గ్రామదీపికల సహకారంతో ఏటేటా కొత్త సంఘాల ఏర్పాటుపై దృష్టిసారిస్తున్నారు. ఆసక్తి గల మహిళలతో మాట్లాడటం, కనీసం పది మందితో ఓ సంఘం ఏర్పాటు చేయడం.. బ్యాంకు లింకేజీ రుణాలివ్వడం నిరంతరం ప్రక్రియగా కొనసాగిస్తున్నారు. ఆపై అందనున్న స్త్రీనిధి, ప్రత్యేక రుణ సదుపాయాలు, వడ్డీ రాయితీ, స్వయం ఉపాధి పథకాలపైనా అవగాహన కల్పిస్తున్నారు. దీంతో పలువురు మహిళలు సంఘంగా ఏర్పాటయ్యేందుకు ముందుకొస్తున్నారు. ఇలా 2020 నుంచి ఇప్పటి వరకు 1,425 కొత్త సంఘాలను నెలకొల్పి.. వేలాది మంది మహిళలను అధికార యంత్రాంగం పొదుపుబాట పట్టించడం విశేషం.

సంఘాల (ఎస్‌హెచ్‌జీ) స్వరూపం

మొత్తం మండలాలు: 23
వీఓ (గ్రామ సమాఖ్యలు): 981
మొత్తం ఎస్‌హెచ్‌జీలు: 18,244
సభ్యుల సంఖ్య: 1,80,213



సుజాతనగర్‌లో స్వయం సహాయక సంఘం మహిళల సమావేశం

☆ "సంఘాల ఏర్పాటు అనేది నిరంతర ప్రక్రియ. సభ్యులుగా చేరితే కలిగే ఆర్థిక ప్రయోజనాలను గ్రామాల్లో మహిళలకు సందర్భోచితంగా విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. దీంతో వేలాది మంది పొదుపుబాట పట్టడం విశేషం. మరోవైపు ప్రభుత్వం రుణ లక్ష్యాలనూ పెంచుతోంది" అని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి విద్యాచందన 'న్యూస్‌టుడే'తో తెలిపారు.

అధికారుల లోపం... భక్తులకు శాపం!

భద్రాచలం, న్యూస్‌టుడే

వాల్మీకి రాసిన రామాయణం ప్రకారం రాముడంటే శబరికి అమితమైన భక్తి. దీన్ని గుర్తించిన ఆలయ వైదిక బృందం గడిచిన దశాబ్దకాలం నుంచి అశ్వయుజ పౌర్ణమికి శబరిమాత ఉత్సవాన్ని నిర్వహిస్తున్నారు. కొన్నిసార్లు ఆలయానికి ఆదివాసీలను రప్పించి ఈ ఉత్సవం నిర్వహిస్తుండగా ఇంకొన్నిసార్లు గిరిజన వాసాలకు వెళ్లి ఈ తరహా సంప్రదాయాలను అమలుచేస్తున్నారు. ఇతర ప్రాంతాల్లో దమ్మక్క, శబరి ఉత్సవాలను చేసినప్పటికీ భద్రాచలం రామాలయంలో ప్రత్యేకంగా వీటిని ఆయా రోజుల్లో నిర్వహిస్తున్నారు. గురువారం నిర్వహించిన శబరిమాత సంబరంలో ఆ స్థాయి వైభవం కానరాలేదు. గిరిజన సంప్రదాయ నృత్యాల జాడే లేదు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ముఖం చాటేశారు.

గంటల తరబడి మూసి ఉన్న ఆంజనేయస్వామి ఆలయం

వైదిక ఉద్యోగుల కొరత

ఇద్దరు వైదిక ఉద్యోగులు సస్పెండ్ అయ్యారు. ఒకరు సెలవులో ఉన్నారు. ఐదుగురు శబరిమాత ఉత్సవం కోసం అశ్వారావుపేట మండలం వినాయకపురం వెళ్లగా మరొకరు కూనవరంలోని శబరి నదీ పూజకు హాజరయ్యారు. దీనికి తోడు వైదిక ఉద్యోగుల కొరత చాలా కాలంగానే వేధిస్తోంది. ఇటీవల దసరా ఉత్సవాలకు కొంతమందిని తాత్కాలికంగా విధుల్లోకి తీసుకుని ఆ తర్వాత తొలగించారు. అవసరాలను అనుసరించి ఇలాంటి వారి సేవలను తీసుకోవాలి. లేదంటే ఉన్నవారికే అదనపు బాధ్యతలు అప్పగించాలి. శని, ఆదివారాలలో పర్ణశాలలో అన్నదానం చేస్తామని చెబుతున్న అధికారులు ఇప్పటికైనా అనుబంధ ఆలయాల దర్శన వేళలను కచ్చితంగా పాటించాల్సి ఉంది.



మూతపడిన ఆంజనేయస్వామి ఆలయం

హే రాం..!

ఇదే క్రమంలో వైదిక ఉద్యోగుల కొరత ఉందని తెలిసినప్పటికీ ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టకపోవడంతో దక్షిణ అయోధ్యగా కీర్తిపొందిన శ్రీరామ క్షేత్రంలోని రెండు అనుబంధ ఆలయాల దర్శనం భక్తులకు కలగలేదు. ఇక్కడి ఆంజనేయస్వామి, లక్ష్మీతాయారు అమ్మవారి ఆలయాలకు గురువారం ఉదయం నుంచి గంటల తరబడి తాళాలు వేసి ఉండడంతో దూరప్రాంతాల నుంచి వచ్చిన వారు బయట నుంచే దండం పెట్టుకుని వెనుతిరగాల్సి వచ్చింది. మధ్నాహ్యం తర్వాత సమస్య తీవ్రత తగ్గినప్పటికీ శబరి మాత ఉత్సవం రోజున గంటల తరబడి అనుబంధ ఆలయాలకు తాళాలు తీయకపోవడం చర్చనీయాంశమైంది. దీనికి తోడు ఉచిత ప్రసాద వినియోగం అరకొరగానే సాగింది. కోవెల దర్శనం తర్వాత తీర్థం ఇచ్చే వారు కరవయ్యారు.

వైదిక బృందంతో ఈఓ సమావేశం

భద్రాచలం, న్యూస్‌టుడే: రామాలయం వైదిక బృందంతో ఈఓ రమాదేవి గురువారం సాయంత్రం సమావేశమయ్యారు. ప్రధాన ఆలయానికి అనుబంధంగా ఉన్న ఆంజనేయస్వామి, లక్ష్మీతాయారు ఆలయాలకు ఉదయం తాళాలు వేసి ఉంచడంపై చర్చించారు. ఎందుకు ఇలా చేశారనే అంశంపై ఉద్యోగుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. సమగ్ర విచారణ జరిపి నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని అక్కడి నుంచి వచ్చే ఆదేశాలతో తగు చర్యలు ఉంటాయని ఈఓ వెల్లడించారు. ఉచితంగా సేవ అందించేందుకు తాత్కాలిక పరిచారకులు ముందుకు వచ్చినా వీరిని విధుల్లోకి తీసుకోవాలంటే దేవాదాయ శాఖ కమిషనర్ అనుమతి ఉండాలని స్పష్టం చేశారు.

దాతలు స్పందిస్తే..

ఆ ఊరిలో తొలి వైద్యుడు

ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటు సాధించిన విద్యార్థికి ఆర్థిక ఇబ్బందులు

మానవీయం

నేలకొండపల్లి, న్యూస్‌టుడే

గ్రామంలో ఇప్పటిదాకా వైద్యవిద్యలో ఎవరూ సీటు సాధించలేదు. నిరుపేద కుటుంబానికి చెందిన విద్యార్థి ఆ ఘనత సాధించాడు. అందుబాటులో ఉన్న ప్రభుత్వ విద్యాలయాల్లోనే చదువుతూ పాఠశాల, కళాశాల విద్యను పూర్తి చేశాడు. ఇప్పుడు తనకెంతో ఇష్టమైన వైద్యవిద్య చదువుకు ఆర్థిక ఇబ్బందులు అడ్డుగోడగా నిలుస్తున్నాయి. కూలీపనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న అతని తల్లిదండ్రులు తమ కుమారుని వైద్యవిద్యకు సాయమందించాలని అర్థిస్తున్నారు.

నేలకొండపల్లి మండలం సుర్దేపల్లి గ్రామానికి చెందిన మాతంగి వెంకటేశ్వర్లు, సుశీల దంపతుల కుమారుడు శ్రీపతి. చిన్ననాటి నుంచే చదువులో ముందుండేవాడు. ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకూ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నాడు. పదో తరగతి బోదులబండ హైస్కూల్‌లో పూర్తి చేశాడు. అన్నపురెడ్డిపల్లిలోని గురుకుల కళాశాలలో సీటు దక్కటంతో అక్కడ ఇంటర్‌ చదివి 929 మార్కులు సాధించాడు. ఖమ్మంలో శిక్షణ తీసుకుని ఇటీవల వెల్లడైన 2024 నీట్‌ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 5,556, ఎస్సీ కేటగిరీలో 488వ ర్యాంకు దక్కించుకున్నాడు. జనగాం ప్రభుత్వ వైద్యకళాశాలలో ఎంబీబీఎస్‌ సీటు సాధించాడు. ప్రభుత్వ సీటు వచ్చినా ఏడాదికి హాస్టల్‌, రిజిస్ట్రేషన్‌, ట్యూషన్‌ ఫీజుల రూపంలో రూ.70 వేల వరకూ చెల్లించాల్సి వస్తోంది. దీంతోపాటు పుస్తకాలు, ఇతర స్టడీ మెటీరియల్‌ కోసం రూ.వేలు ఖర్చవుతాయి. తల్లిదండ్రులు కౌలు వ్యవసాయం, కూలిపనులు చేసుకుంటూ కుటుంబాన్ని వెళ్లదీస్తున్నారు. రెక్కాడితేకానీ డొక్కాడని వారికి అంత మొత్తం చెల్లించే స్థోమత లేదు. తమ కుమారుని చదువుకు సాయమందించాలని వారు వేడుకుంటున్నారు. దాతలెవరైనా సాయమందిస్తే వైద్యవిద్య పూర్తి చేసి గ్రామీణ ప్రాంత ప్రజలకు సేవలందిస్తానని శ్రీపతి అంటున్నాడు.


తల్లిదండ్రులతో శ్రీపతి

దాతలు స్పందించాల్సిన ఫోన్‌ నంబరు: 9394450050

ప్లేట్‌ ఫిరాయిస్తే వాతలే

నంబరు ప్లేట్లు సరిగా లేని వాహనాలపై పోలీసుల నజర్‌

కొత్తగూడెం నేరవిభాగం, న్యూస్‌టుడే

రాష్ట్రానికి గంజాయి తరలించే వారికి భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలు గుమ్మంగా మారాయి. సరిహద్దు రాష్ట్రాలైన ఒడిశా, ఏపీలోని పలు ప్రాంతాల్లోంచి హైదరాబాద్‌ తదితర నగరాలకు బస్సులు, కార్లు, లారీల్లో అక్రమంగా పెద్ద ఎత్తున సరకు తరలిస్తున్నారు. ఇటీవల కొందరు యువత ద్విచక్రవాహనాల్లో పెద్ద ఎత్తున గంజాయి తీసుకెళ్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో చేపట్టే తనిఖీల్లో పట్టుబడుతున్నారు. ద్విచక్రవాహనాల్లో ఎక్కువగా నంబరు ప్లేట్లు సరిగా లేనివేనని పోలీసులు గుర్తించారు. మరికొందరు జరిమానాను తప్పించుకోవాలని వక్రబుద్ధి ప్రదర్శిస్తున్నారు. ఈ క్రమంలో జిల్లా పోలీసు యంత్రాంగం 'ప్లేట్‌ ఫిరాయింపు'లపై నజర్‌ పెట్టింది. తనిఖీలను ఉమ్మడి ఖమ్మం జిల్లావ్యాప్తంగా నిరంతరం సాగిస్తేనే సత్ఫలితాలుంటాయి.


నేరాలకు పాల్పడే వారితో పాటు కొందరు వాహనదారులు జరిమానాను తప్పించుకునేందుకు నంబర్‌ ప్లేట్‌ కనిపించకుండా అడ్డదారులు తొక్కుతున్నారు. ఇంకొందరు ట్రెండ్‌ పేరుతో అస్పష్టంగా ముద్రిస్తున్నారు. ఈ క్రమంలో ఆయా వాహనాలను గుర్తించేందుకు ఎస్పీ ఆదేశాలతో జిల్లా పోలీసు అధికారులు ప్రత్యేక డ్రైవ్‌ చేపట్టారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళ్లలో కొన్ని బృందాలను మఫ్టీలో దించారు. వారు దుకాణాలు, కూడళ్లు, జన సమ్మర్ధ ప్రాంతాల్లో నంబరు ప్లేట్లు సరిగా లేని వాహనాలను పట్టుకుంటున్నారు. తొలి తప్పుగా కొందరు వాహనదారులను హెచ్చరించి జరిమానాతో వదిలేస్తున్నారు. అయినా హద్దులు మీరితే కేసులు నమోదు చేసి క్రిమినల్‌ చర్యలు తీసుకుంటున్నారు. కొందరు బుల్లెట్‌ వాహన యజమానులు మోటారు వాహన చట్టాన్ని కాదని డాబు ప్రదర్శిస్తున్నారు. అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లను బిగించడంపై పోలీసులు సీరియస్‌గా ఉంటున్నారు. ఏ మాత్రం ఉపేక్షించకుండా సైలెన్సర్లను తొలగించి ధ్వంసం చేస్తున్నారు. ఈ ప్రయోగం సత్ఫలితాలిస్తున్నట్లు పోలీసులు చెబుతున్నారు.


నంబర్‌ ప్లేట్‌ లేకుండానే వాహన వినియోగం

నంబర్‌ ప్లేట్లపై తనిఖీలు, కేసులు
(ఈ ఏడాది జనవరి నుంచి..)

ఉల్లంఘన	కేసులు	జరిమానా (రూ.ల్లో)
నంబర్లు సరిగా లేనివి	869	1,73,800
ఫ్యాన్సీ, ఇరెగ్యులర్‌ ప్లేట్లు	91	18,200
ట్యాంపర్‌ చేసినవి	182	36,400
నంబర్లు తొలగించినవి	481	96,200

నిబంధనలు పాటించేలా అవగాహన



రోడ్డు భద్రత నిబంధనలు, మోటారు వాహన చట్టాన్ని పాటించడంపై అవగాహన కల్పించడంతో పాటు ఉల్లంఘనలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నాం. ముఖ్యంగా నంబరు ప్లేట్‌ సరిగా లేనివారిని ఉపేక్షించే ప్రసక్తే ఉండదు. తప్పు మళ్లీ చేస్తే వాహనాన్ని సీజ్‌ చేస్తాం. ద్విచక్ర వాహనాలను నడిపే విషయంలో యువత దూకుడుగా వ్యవహరించొద్దు. సైలెన్సర్లతో రద్దీలో అధిక శబ్దం చేస్తే ఇతరులు భయాందోళన చెందుతారు. ఒక్కోసారి గుండెపోటు వచ్చే ప్రమాదమూ పొంచిఉందని వైద్యులు చెబుతున్నారు. ఈ క్రమంలో నిబంధనల పాటింపుపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం.

\- బి.రోహిత్‌రాజు, ఎస్పీ, భద్రాద్రి కొత్తగూడెం

'మధిర బాలోత్సవ్‌- 2024' బ్రోచర్‌ ఆవిష్కరణ

మధిర, న్యూస్‌టుడే: జాతీయ స్థాయి మధిర బాలోత్సవ్‌-2024కు సంబంధించిన బ్రోచర్‌ను ఆ సంస్థ అధ్యక్షుడు పుతుంబాక శ్రీకృష్ణప్రసాద్‌, సెక్రటరీ బాబ్లా స్థానిక శ్రీ వేంకటేశ్వర ఆలయంలో గురువారం ఆవిష్కరించారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా రామభక్త సీతయ్య కళాపరిషత్‌ ఆధ్వర్యంలో నవంబరు నెలలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు కమిటీ తెలిపింది. నవంబరు 15, 16 తేదీల్లో బంజారాకాలనీలోని శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణ మండపంలో పోటీలు నిర్వహిస్తామన్నారు. 15న శాస్త్రీయ నృత్యాలు, జానపద నృత్యాలు, 16న నీతి పద్యాలు, నీ సత్తా చాటుకో, ఏకపాత్రాభినయాలు, ఉపన్యాసం, దేశభక్తి గేయాలు, చిత్రవేషాల ప్రదర్శన తదితర అంశాల్లో పోటీలుంటాయని వివరించారు. ఎంట్రీలను నవంబరు 10లోగా 'మధిర బాబ్లా సెక్రటరీ, ఇంటి నంబర్‌ 1-329, బంజారా కాలనీ, మధిర' అనే చిరునామాకు పంపాలని, పూర్తి వివరాలకు 94406 75787ను సంప్రదించాలని కోరారు.


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న పుతుంబాక శ్రీకృష్ణప్రసాద్‌ తదితరులు

గిరిజన గురుకుల అతిథి అధ్యాపకుల దరఖాస్తులు

భద్రాచలం, న్యూస్‌టుడే: గిరిజన గురుకుల డిగ్రీ కళాశాలల్లో అతిథి అధ్యాపకులుగా పని చేసేందుకు అర్హులైన అభ్యర్థులు ఈనెల 25 వరకు భద్రాచలం ఆర్సీఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఐటీడీఏ పీఓ రాహుల్‌ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో పాటు డెమో ఆధారంగా ఎంపికలు ఉంటాయని వెల్లడించారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలలోని కళాశాలల్లో 13 పోస్టులను గెస్ట్‌ ఫ్యాకల్టీ పద్ధతిలో భర్తీ చేస్తున్నట్లు వివరించారు. తెలుగు 2, ఇంగ్లిష్‌ 1, కెమిస్ట్రీ 1, జువాలజీ 2, కంప్యూటర్‌ సైన్స్‌ 2, కామర్స్‌ 3, ఎకనామిక్స్‌ 1, చరిత్ర 1 పోస్టులు ఉన్నాయన్నారు.

'నవోదయ' 9, 11 తరగతుల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కూసుమంచి, న్యూస్‌టుడే: పాలేరులోని జవహర్‌ నవోదయ విద్యాలయలో 2025-26 విద్యా సంవత్సరంలో 9, 11 తరగతుల్లో ప్రవేశానికి గాను దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విద్యాలయ ప్రధానాచార్యుడు కె.శ్రీనివాసులు ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా తరగతుల్లో ప్రవేశ పరీక్షల ద్వారా ఖాళీల భర్తీ ప్రక్రియ నిర్వహించనున్నట్లు వివరించారు. తొమ్మిదో తరగతిలో ప్రవేశానికి ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ, ప్రభుత్వ అనుమతి పొందిన పాఠశాలల్లో చదువుతూ ఉన్న విద్యార్థులు అర్హులన్నారు. ఈ నెల 30లోగా www.navodaya.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేయాలన్నారు.

ఇంద్రకీలాద్రికి పాదయాత్ర



టేకులపల్లి, న్యూస్‌టుడే: టేకులపల్లి నుంచి విజయవాడలోని ఇంద్రకీలాద్రి దుర్గమ్మను దర్శించుకునేందుకు స్థానిక కోదండరామాలయం అర్చకులు శ్రీరంగం విజయ్‌సాయి చక్రి గురువారం తెల్లవారుజామున పాదయాత్రగా బయల్దేరి వెళ్లారు. అంతకు ముందు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గురువారం రాత్రికి ఆయన చంద్రుగొండ చేరుకున్నారు.

నీలమణి వచ్చేసింది



పాలపిట్ట నీలమణి పేరుతో ఓ పోస్టర్‌ గురువారం ఖమ్మం స్టేడియంలో ప్రత్యక్షమైంది. సీఎం కప్‌ పేరుతో ఓ క్రీడా సంబరానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రూరల్‌ టు గ్లోబల్‌, క్రాఫ్టింగ్‌ ఛాంపియన్స్‌ అనే ట్యాగ్‌ లైన్‌లను ఇప్పటికే విడుదల చేశారు. సీఎం కప్‌ క్రీడల చిహ్నంగా 'నీలమణి' పేరుతో పాలపిట్టను ఎంపిక చేశారు. రాష్ట్ర ప్రభుత్వ అధికార పక్షి జెర్సీ ధరించిన లోగోను ప్రభుత్వం విడుదల చేసింది. క్రీడల ప్రారంభానికి ముందు నుంచే సందడి చేస్తున్న నీలమణి ఖమ్మం పటేల్‌ స్టేడియంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

\- ఖమ్మం క్రీడలు, న్యూస్‌టుడే

ఒడిసిపడితేనే.. తాగునీరు

మణుగూరు మండలంలోని బుడగల గ్రామానికి వెళ్లాలంటే అటవీ ప్రాంతంలో సుమారు 25 కి.మీటర్లు ప్రయాణించాలి. ఐదు వాగులు దాటాలి. కాలినడక కూడా కష్టమేనంటే అతిశయోక్తికాదు. అయినా అడవినే నమ్ముకొని 50 ఇళ్లు వెలిశాయి. జనాభా 125 మంది. ప్రస్తుతం వారిని తాగునీటి సమస్య వేధిస్తోంది. వాగునీరు తాగడంతో స్థానికంగా తరచూ డయేరియా సోకుతోంది. దీంతో గ్రామస్థులందరూ రాళ్లను ఎత్తుగా పేర్చి వాటిపై రెండు వరలను అమర్చారు. భూమి నుంచి వచ్చే ఊట నీరు వెళ్లకుండా చుట్టూ మట్టికప్పారు. దీంతో నీటితో ఆ వరలు నిండిపోతాయి. వాటిని బిందెల ద్వారా తెచ్చుకొని అవసరాలు తీర్చుకుంటున్నారు. కాగా ఈ విషయాన్ని ఐటీడీఏ పీవో రాహుల్‌ దృష్టికి 'న్యూస్‌టుడే' తీసుకువెళ్లగా.. అతిత్వరలో తాగునీటి బావిని ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

\- మణుగూరు, న్యూస్‌టుడే



గట్టున పడేందుకు..



మీరు చూస్తున్న ఈ చిత్రం.. డంపింగ్‌ యార్డు నుంచి ఇసుకను తరలించేందుకు జరుగుతున్న ప్రయత్నాలు అని భావిస్తే పొరబడినట్టే. ఆకేరు వరద అన్నదాతలకు తీసుకొచ్చిన కష్టాలివి. ఇటీవల భారీ వర్షాలు, వరద ఉద్ధృతికి ఆకేరు పరీవాహక ప్రాంతాల్లోని వందలాది ఎకరాల పంట పొలాల్లో ఇసుక మేటవేసింది. వ్యవసాయ భూములు ఆనవాళ్లు కోల్పోయాయి. దీంతో తమ పొలం గట్లు ఎక్కడున్నాయోనని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. రాకాసితండా పరిధిలోని పంట పొలాల్లో నిలిచిపోయిన ఇసుక మేటలను రూ.లక్షల వెచ్చించి జేసీబీ, ట్రాక్టర్ల సాయంతో బయటకు తరలిస్తున్నారు. పొలం గట్లను గుర్తించే పనిలో మునిగిపోయారు. – న్యూస్‌టుడే, తిరుమలాయపాలెం

నకిలీ చలాన్లు పంపించిన పలువురిపై కేసు నమోదు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: ఖమ్మం నగరానికి చెందిన మనోహర్‌, విజయలక్ష్మి, సురేష్‌, వేణు, సునీత, భద్రాచలానికి చెందిన నాగసుధీర్‌, సారపాకకు చెందిన రామకృష్ణ, మరిపెడబంగ్లాకు చెందిన విజయ్‌కుమార్‌, మహబూబాబాద్‌కు చెందిన రమేష్‌పై కర్నూలు నాలుగో పట్టణ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. కర్నూలుకు చెందిన వెంకన్న వద్ద వీరంతా మసాలాలు కొనుగోలు చేశారు. రూ.26,31,760 చెల్లించినట్లు నకిలీ బ్యాంకు చలాన్లు పంపి మోసగించారు. బాధితుడు ఈనెల 7న కర్నూలు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకుని రాణించాలి: పీఓ

భద్రాచలం, న్యూస్‌టుడే: అవకాశాలను సద్వినియోగం చేసుకుని జీవితంలో అనుకున్న లక్ష్యాలను చేరుకుని మిగతా వారికి ఆదర్శనీయంగా ఉండాలని ఐటీడీఏ పీఓ రాహుల్‌ సూచించారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఎంపికైన లబ్ధిదారులకు గురువారం తన కార్యాలయంలో చెక్కులు అందించారు. ట్రైకార్‌ ద్వారా మంజూరైన గ్రామీణ రవాణా పథకంలో చర్ల మండలానికి చెందిన చుంచుపల్లి అశోక్‌, చిక్కాల సంతోష్‌కుమార్‌లకు రెండు జోస్‌ బ్లూ వాహనాలు మంజూరు చేశారు. ఒక్కో దాని ధర రూ.8.31 లక్షలు ఉండగా ఇందులో రాయితీ రూ.2.88 లక్షలు వచ్చిందని తెలిపారు. బ్యాంకు రుణం రూ.4.38 లక్షలు ఉండగా లబ్ధిదారు వాటా కింద రూ.1.05 లక్షలు జమ చేయాల్సి ఉందని వెల్లడించారు. ములకలపల్లి మండలానికి చెందిన గోడ నరేశ్‌కు రూ.6.39 లక్షల విలువైన టాటా ఏసీ వాహనం మంజూరైందని దీనికి రూ.రూ.2.88 లక్షల రాయితీ వచ్చిందని చెప్పారు. వీరికి వాహన తాళాలు అందించి రాణించాలని అభిలషించారు.

★ టేకులపల్లి మండలానికి చెందిన గిరిజన మహిళలకు రూ.9.90 లక్షల రాయితీ చెక్కును పీఓ అందించారు. రూ.16 లక్షలతో రుతు రుమాళ్ల యూనిట్‌ మంజూరైనందున దీన్ని పరిశ్రమలా తీర్చిదిద్దుకుని ముందుకు సాగాలని సూచించారు. నిరుద్యోగులు అందుబాటులో ఉన్న ఉపాధి మార్గాలను ఎంచుకుని అభివృద్ధి చెందాలని చెప్పారు.



గిరిజన మహిళలకు రూ.9.90 లక్షల చెక్కు అందిస్తున్న పీఓ రాహుల్‌


సత్తుపల్లి: చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి తదితరులు

గిరిపుత్రికకు ఐటీడీఏ పీఓ ఆర్థిక సాయం

ఈనాడు కథనానికి స్పందన

సత్తుపల్లి, భద్రాచలం, న్యూస్‌టుడే: వైద్య విద్యలో సీటు సాధించిన సత్తుపల్లి మండలం గుడిపాడుకు చెందిన గిరిపుత్రిక రాజిని శివభార్గవిని ఐటీడీఏ పీవో రాహుల్‌ అభినందించారు. సంస్థ తరపున గురువారం భద్రాచలంలో విద్యార్థినికి రూ.50వేలు అందజేశారు.

★ సత్తుపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మట్టా రాగమయి, డాక్టర్‌ మట్టా దయానంద్‌ దంపతులు రాజిని శివభార్గవిని శాలువాతో సత్కరించి అభినందించారు. అమెరికాలో నివాసం ఉంటున్న కాంగ్రెస్‌ సీనియర్‌ నాయకుడు చల్లగుళ్ల నరసింహారావు కుమారుడు నిఖిల్‌, గౌతమి దంపతులు వితరణ చేసిన రూ.20వేల చెక్కును సదరు విద్యార్థినికి ఎమ్మెల్యే అందజేశారు. వీటితోపాటు దిలీప్‌ రూ.4,500లను ఫోన్‌పే ద్వారా చెల్లించారు. మొత్తంగా విద్యార్థినికి రూ.3,14,500 సమకూరాయి.

రామాలయంలో శబరి మాత ఉత్సవం

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో గురువారం అశ్వయుజ పౌర్ణమిని పురస్కరించుకుని శబరిమాత ఉత్సవాన్ని నిర్వహించారు. పండ్లు పూలను పట్టుకుని ఆలయ ప్రదక్షిణ చేశారు. కోవెల ప్రాంగణంలోని వాల్మీకి విగ్రహం వద్ద శబరి స్మృతి యాత్రను ఏఈవో భవాని రామకృష్ణారావు, ప్రధానార్చకుడు విజయరాఘవన్‌, పీఆర్వో సాయిబాబా ప్రారంభించారు. శబరిమాత చిత్రపటానికి పూలదండలు వేశారు. చిత్రకూట మండపం నుంచి మాడవీధుల మీదుగా గిరి ప్రదక్షిణ సాగింది. రాజా తూము లక్ష్మీనరసింహదాసు, భక్తరామదాసు, దమ్మక్క విగ్రహాలకు పూలదండలు అలంకరించారు. గిరిప్రదక్షిణ నుంచి ఆలయానికి చేరుకున్న అడవి బిడ్డలు స్వామిని దర్శించుకున్నారు. పండ్లు పుష్పాలను సమర్పించారు. నిత్య కల్యాణోత్సవ విశిష్టతను వైదిక పెద్దలు వివరించారు. మాంగళ్యధారణ వేళ భక్తులు నీరాజనాలు పలికారు. తలంబ్రాల సన్నివేశం తన్మయత్వాన్ని నింపింది. గిరిజన మహిళలకు శబరిమాత ప్రసాదంగా చీర, సారెను అందించారు. తీర్థప్రసాద వినియోగమైంది. ప్రధానార్చకుడు విజయ రాఘవన్‌ నేతృత్వంలో వైదిక ప్రక్రియను నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరంలోని శబరి నదికి రామాలయం నుంచి వెళ్లిన వైదిక సిబ్బంది పూజలు చేశారు. ఈ నదికి చీర సారె సమర్పించారు. అక్కడ ఉన్న శబరి మాత విగ్రహానికి పూజలు చేశారు.


శబరి మాత చిత్రపటంతో ఊరేగింపు

బెళగావి ఎక్స్‌ప్రెస్‌ మళ్లీ వచ్చిందోచ్‌

మణుగూరు గ్రామీణం, న్యూస్‌టుడే: బెళగావి ఎక్స్‌ప్రెస్‌ పునఃప్రారంభమైంది. గురువారం మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో కొత్తగూడెం మీదుగా మణుగూరు రైల్వేస్టేషన్‌ను చేరుకుంది. గతంలో ఉన్న ఈ ఎక్స్‌ప్రెస్‌ను దక్షిణ మధ్య రైల్వే అధికారులు రద్దు చేసి హైదరాబాద్‌ వరకే పరిమితం చేసిన విషయం తెలిసిందే. దాంతో మణుగూరు రైల్వేస్టేషన్‌కు ఒకే ఒక రైలు దిక్కయింది. తరవాత ఈ ప్రాంతవాసులు ఎన్నో విజ్ఞాపనలు చేసిన అనంతరం స్పందించిన దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఎట్టకేలకు బెళగావి ఎక్స్‌ప్రెస్‌ను హైదరాబాద్‌ నుంచి మణుగూరు వరకు పొడిగిస్తూ ఉత్తర్వులను జారీ చేశారు. మధ్యాహ్నం మూడున్నర గంటలకు అది ఇక్కడి నుంచి బయలుదేరి వెళ్లింది. వారానికి నాలుగుసార్లు ఆది, సోమ, బుధ, గురువారాల్లో ఇది నడవనున్నట్లు మణుగూరు రైల్వేస్టేషన్‌ మాస్టర్‌ శివప్రసాద్‌ చెప్పారు. మొత్తం 95 ట్రిప్‌ల వరకు దీన్ని నడిపించనున్నారు. ఇది మొదటి ట్రిప్‌. అనంతరం ప్రజల ఆదరణ ఉందా? లేదా? అనే దానిపై లెక్కలు తీయనున్నారు. అనంతరం దీన్ని కొనసాగించాలా? వద్దా? అనే విషయమై దక్షిణ మధ్య రైల్వే అధికారులు నిర్ణయం తీసుకోనున్నారు.


మణుగూరు రైల్వే స్టేషన్‌లో ఆగిన బెళగావి ఎక్స్‌ప్రెస్‌

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో ధరలు (రూ.లలో)

పంట పేరు	కనిష్ఠ	గరిష్ఠ	నమూనా
కొత్తపత్తి	5,800	7,000	6,800
పెసలు	3,500	7,400	7,100
ఏసీ ఎండుమిరప	14,500	19,000	16,000
ఏసీతాలుమిరప	6,800	9,600	9,000
ఎండుమిరప	9,000	16,900	15,000
తాలుమిరప	6,600	9,000	8,000

చికెన్‌ ధరలు వెన్‌కాబ్‌: బ్రాయిలర్‌ ఫారం లిఫ్టింగ్‌ ధర -130 రిటైల్‌ ధర 152 చికెన్‌ విత్‌ స్కిన్‌ - 220, చికెన్‌ స్కిన్‌లెస్‌ - 251.

వీవీపాలెం.. సేవల్లో ఘనం

ప్రగతి పథంలో ప్రాథమిక సహకార సంఘం

ఆరు దశాబ్దాల కిందట ఏర్పాటు చేసిన ఆ ప్రాథమిక సహకార పరపతి సంఘం అంచెలంచెలుగా ఎదిగింది. రైతులకు పలు రకాల సేవలందిస్తూ ఉమ్మడి జిల్లాలోనే తనకంటూ ఓ ప్రత్యేకతను చాటుకుంటోంది. క్రమంగా ఎదుగుతూ 15 వేల మంది సభ్యులతో, 5,600 మంది ఓటర్లతో అలరారుతోంది. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం వి.వెంకటాయపాలెం సొసైటీపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం..

రఘునాథపాలెం, న్యూస్‌టుడే:

వీవీపాలెం, వేపకుంట్ల, ఎం.చింతగుర్తి రెవెన్యూ గ్రామాల పరిధిలోని 11 గ్రామాలతోపాటు, నగర శివారు బల్లేపల్లి, ధంసలాపురం, వెలుగుమట్ల రెవెన్యూ గ్రామాలతో 1962లో ఈ సంఘం ఏర్పాటైంది. రైతులకు రుణాలు అందించడంతోపాటు సాధారణ బ్యాంకు సేవలు నిర్వహిస్తున్నారు. ఎరువులు, విత్తనాలు, టార్పాలిన్‌ పట్టాలు విక్రయిస్తుంటారు. మినరల్‌ వాటర్‌ ప్లాంట్‌ ఏర్పాటు చేసి గ్రామ ప్రజలకు తక్కువ ధరకు నీరు అందిస్తున్నారు. మీసేవ కేంద్రం త్వరలో ప్రారంభించనున్నారు. 3,317 మంది రైతులకు రూ.15 కోట్లు పంట రుణం అందించారు. 45 మందికి దీర్ఘకాలిక(ఎల్‌టీ) రుణంగా రూ.కోటి, 400 మందికి మధ్యకాలిక(ఎంటీ) రుణంగా రూ.1.5 కోట్లు అందించారు. 1,062 మంది రైతులకు రూ.4.75 కోట్లు రుణమాఫీ చేశారు. వీరిలో 600 మంది రైతులకు రూ.2.7 కోట్లు రుణంగా అందించారు. మరో రూ.40 లక్షలు రుణం అందించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.


వి.వెంకటాయపాలెం ప్రాథమిక సహకార సంఘం

సంఘం ప్రత్యేకతలు..

40 చొప్పున చిన్న, పెద్ద లాకర్లు అందుబాటులోకి తెచ్చారు. జిల్లాలో ఈ సౌకర్యం కలిగిన ఏకైక సంఘంగా ఇదే. ★ సంఘంలో 5 వేల సేవింగ్స్‌ బ్యాంక్‌ ఖాతాలున్నాయి. 3 వేల ఖాతాలు నిర్వహణలో ఉన్నాయి. రూ.35 లక్షలు లావాదేవీలు జరిగాయి. ★ సంఘంలో ఇటీవలి వరకు రూ.3 కోట్లు ఫిక్స్‌డ్‌ డిపాజిట్‌గా ఉన్నాయి. ప్రస్తుతం రూ.2.2 కోట్లు ఎఫ్‌డీగా ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో ఇలా భారీ మొత్తంలో డిపాజిట్‌ కలిగిన ఏకైక సంఘం ఇది. ★ కేంద్రం నిధులతో 300 మెట్రిక్‌ టన్నుల సామర్థ్యం కలిగిన గోదాము అందుబాటులోకి తెచ్చారు. ★ బంగారం మదుపుగా పెట్టుకుని 520 మందికి రూ.5.4 కోట్లు రుణంగా అందించారు. ★ 2018-19లో మొక్కజొన్నల కొనుగోలులో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది.

పురస్కారాలు....

2023-24కు నిరర్థక అప్పులు తగ్గించినందుకు, డిపాజిట్లు, బంగారం రుణాలు అందించినందుకు ప్రథమ, నష్టాలు తగ్గించినందుకు బెస్ట్‌ పెర్ఫామెన్స్‌ కింద ప్రథమ పురస్కారాలను అందుకుంది.

కొవిడ్‌ విపత్తులోనూ సేవలు

\- రావూరి సైదుబాబు, ఛైర్మన్‌



రైతుల సంక్షేమమే లక్ష్యంగా మా సంఘం పని చేస్తోంది. కొవిడ్‌ విపత్తులోనూ సేవలు కొనసాగించాం. ధాన్యం కొనుగోలు చేసి రైతులకు అండగా నిలిచాం. పెద్ద మొత్తంలో డిపాజిట్లు సేకరించడం, బంగారంపై రుణాలు ఇవ్వడంలో జిల్లాలోనే ప్రథమ స్థానంలో ఉన్నాం.



గిరిజనుల కొమ్ము నృత్యాలు

ఘనంగా శబరి స్మృతి యాత్ర

అశ్వారావుపేట, అన్నపురెడ్డిపల్లి, న్యూస్‌టుడే: భద్రాచలం సీతారామస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో శబరి స్మృతి యాత్ర వినాయకపురంలో గిరిజన సంప్రదాయ పద్ధతిలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈఓ ఎల్.రమాదేవి సారథ్యంలో నిర్వహించారు. కొమ్ము-డోలు నృత్యాలతో గిరిజనులు అలరించారు. ఆలయ నిర్వాహకులు ప్రసాద్, నరాల శ్రీను పాల్గొన్నారు. ★ అన్నపురెడ్డిపల్లిలోని శ్రీభ్రమరాంబ సమేత శ్రీమల్లికార్జునస్వామి ఆలయంలో పౌర్ణమిని పురస్కరించుకుని చండీహోమం గురువారం నిర్వహించారు. అర్చకులు సత్యనారాయణశర్మ ఆధ్వర్యంలో కార్యక్రమం వైభవంగా సాగింది. మేనేజరు పీవీ రమణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

భద్రాచలం

• భద్రాచలం • పినపాక • అశ్వారావుపేట

గ్రంథాలయానికి సీలింగ్ పంకాలు, కుర్చీలు వితరణ

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక శాఖా గ్రంథాలయానికి రెండు సీలింగ్ పంకాలు, రెండు స్టడీ కుర్చీలు జీవన్ ఆసుపత్రి యాజమాన్యం చల్లగుళ్ల నాగేశ్వరరావు గురువారం వితరణగా అందజేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సంపత్‌కుమార్ చేతుల మీదుగా గ్రంథపాలకుడు జానీకి అందించినట్లు తెలిపారు. మెడికల్ సంఘం జిల్లా కార్యదర్శి పరిమి సోమశేఖర్, భద్రాచలం అధ్యక్షుడు కేశవ్ పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
భద్రాచలం: 79950 67029
అశ్వారావుపేట: 80085 73696
పినపాక: 91212 29033

సమస్య: మణుగూరు పాత పోలీసుకాలనీలోని పలు వీధుల్లో పిచ్చిమొక్కలు విపరీతంగా పెరిగాయి. **- సువర్ణ, అశోక్‌నగర్**

సమాధానం: పంచాయతీ సిబ్బందిని పంపించి 24 గంటల్లో పిచ్చిమొక్కలను తొలగిస్తాం. **- పల్నాటి వెంకటేశ్వర్లు, ఈవోఆర్డీ**

– మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే

✆ ఆళ్లపల్లి గ్రామ పంచాయతీ కార్మికులు సుమారు నెల రోజులుగా చెత్త సేకరణ చేయకపోవడంతో ఎక్కడి చెత్త అక్కడే కుప్పలుగా నిల్వ ఉంటోంది. **- స్థానికులు ఆళ్లపల్లి**

✔ ఆళ్లపల్లి గ్రామ పంచాయతీ ట్రాక్టర్ మరమ్మతులకు గురైంది. ట్రాక్టర్ మరమ్మతులు చేయిస్తున్నాం. ఆళ్లపల్లిలో చెత్త నిల్వ లేకుండా వారం రోజుల్లో శుభ్రం చేయిస్తా.

- వి.శిరీష, ఆళ్లపల్లి పంచాయతీ కార్యదర్శి

– ఆళ్లపల్లి, న్యూస్‌టుడే

✆ మొండికుంటలోని ప్రధాన వీధుల్లో డ్రైనేజీలకు ఇరువైపులా విపరీతంగా గడ్డి పెరిగి దోమలు విజృంభిస్తున్నాయి.

- తూము సత్యనారాయణ, మొండికుంట

✔ పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

- ఆరెల్లి ప్రవీణ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి, మొండికుంట. – అశ్వాపురం, న్యూస్‌టుడే

ఏజెన్సీలో సమస్యలపై ఎమ్మెల్సీ కోదండరాంకు వినతి

భద్రాచలం పట్టణం, చర్ల, న్యూస్‌టుడే: ఏజెన్సీలో సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్సీ, తెజస రాష్ట్ర అధ్యక్షుడు ఆచార్య కోదండరాంకు భద్రాచలం నియోజకవర్గ తెజస కోఆర్డినేటర్ పూనెం ప్రదీప్‌కుమార్ గురువారం హైదరాబాద్‌లో కలిసి వినతి పత్రం అందజేశారు. నేతలు గోపగాని శంకర్‌రావు, రామారావు తదితరులు పాల్గొన్నారు. ★ తమకు కోయ కుల ధ్రువీకరణ పత్రాలను అర్ధాంతరంగా నిలిపివేయడంతో తీవ్రంగా నష్టపోతున్నామని గొత్తికోయ యువసేన నాయకుడు మడకం చందు పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ఎంఎల్సీ, ప్రొఫెసర్ కోదండరాంకు ఆయన వినతి పత్రం సమర్పించారు.

ఐటీఐ కళాశాలలో అభివృద్ధి పనులు

మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: మణుగూరులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఆవరణలో స్కిల్ ఇండియా డెవలప్‌మెంట్‌లో భాగంగా టాటా సంస్థ ఆధ్వర్యంలో ఏటీసీ భవనాన్ని నిర్మిస్తున్నారు. వ్యయం సుమారు రూ. 20 లక్షలు. కళాశాల విద్యార్థులకు శుద్ధజలం అందించాలన్న లక్ష్యంతో ఆర్వో ప్లాంటు, రెండు మంచినీటి బోర్లు ఏర్పాటు చేశారు. కళాశాల చుట్టూ ప్రహరీ, అంతర్గతంగా సీసీరోడ్డు నిర్మిస్తున్నారు. కళాశాలకు ఎటువంటి సమస్యలు ఉన్నా.. తన దృష్టికి తీసుకువస్తే తక్షణమే నిధులు మంజూరు చేస్తానని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు హామీ ఇచ్చినట్లు ప్రిన్సిపల్ బడుగు ప్రభాకర్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు.



నూతనంగా ఏర్పాటు చేసిన మంచినీళ్ల బోరు



కళాశాల ఆవరణలో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్డు

చెట్టు.. సులువుగా మార్చేట్టు..!



నెల రోజుల్లో మూడు చోట్లకు మారిన మామిడి చెట్టు

మణుగూరు, న్యూస్‌టుడే

మొక్కలను ఒకచోట నుంచి మరో చోటుకు మార్చవచ్చు. వృక్షాలను మార్చడం సాధ్యం కాదు. మణుగూరు సింగరేణిలో మాత్రం వృక్షాలను ఒక చోట నుంచి మరో చోటుకు సులువుగా మార్చుతున్నారు. 100, 80, 40 డంపర్ల టైర్లకు ఉండే ఇనుప కవటాల(కుండీల)ను ఎంపిక చేశారు. వీటిల్లో బత్తాయి, మామిడి, సపోట, పనస తదితర పండ్ల మొక్కలను పెంచారు. వృక్షాలను రెండు, మూడు నెలలకు ఒకసారి మార్చుతున్నారు. స్థలాల ఉపయోగాలను బట్టి ఆ వృక్షాలను నలుగురు కార్మికులు కలిసి మరో చోటుకి మారుస్తున్నారు. ఫలితంగా ఆ వృక్షానికి ఎలాంటి ఇబ్బంది ఉండదు. ఇలాంటి వృక్షాలు పదుల సంఖ్యలో ఉన్నాయి. వ్యర్థాలను వినియోగంలోకి తీసుకురావడం ఒక ప్రయోగం అయితే వృక్షాలను సంరక్షించడం మరో ప్రయత్నం. కార్మికులు పనికిరాని కుండీల్లో వృక్షాలను పెంచి వాటిని మార్చుతుండటం గమనార్హం.

నీలివర్ణంలో పేరెంటాల చెరువు



మణుగూరులోని పేరెంటాల చెరువు ప్రస్తుతం ప్రకృతి అందాలతో చూపరులను విశేషంగా ఆకట్టుకుంటోంది. మధ్యాహ్నం సమయంలో భానుడి ప్రతాపానికి నీలాకాశంలో తెల్లని మబ్బులతోపాటు చెరువులోని నీరు కూడా నీలంరంగులో ఆకర్షణ సుందరంగా కనపడుతోంది. దీంతో సాంబాయిగూడెం నుంచి పగిడేరు వెళ్లే వాహనదారులతోపాటు స్థానిక యువత చెరువు అందాలను వీక్షిస్తూ ఆనందపడుతున్నారు.

– మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే

శిథిలావస్థలో పశువైద్యశాల!

చంద్రుగొండ, న్యూస్‌టుడే: చంద్రుగొండలోని పశువైద్యశాల శిథిలావస్థకు చేరింది. చిన్నపాటి వర్షానికే కురుస్తుండటంతో వైద్యశాలలోని మందులన్నీ తడిసిపోతున్నాయి. వైద్య సేవలు అందించేందుకు రెగ్యులర్ వైద్యాధికారి లేకపోవటంతో పశు యజమానులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నూతన భవనం నిర్మించి మెరుగైన వైద్య సేవలు అందించాలని స్థానికులు కోరుతున్నారు. పశువైద్యాధికారి సంతోష్‌ని వివరణ కోరగా.. శిథిలావస్థ భవనం గురించి పై అధికారులకు తెలియజేశామని తెలిపారు.



గిరిజన మ్యూజియం ఏర్పాటుకు ప్రణాళికలు: కలెక్టర్

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: గిరిజన మ్యూజియం ఏర్పాటు చేసి దేశ, విదేశాల నుంచేకాకుండా అన్ని వర్గాల ప్రజలు సందర్శించే విధంగా తగు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ తెలిపారు. నారాయణరావుపేట, బొజ్జికుప్ప గ్రామాల్లో కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ గురువారం పర్యటించి గిరిజనుల నివాస గృహాలను, పరిసరాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామిని దర్శించుకోవడానికి దేశ, విదేశాల నుంచి భక్తులు అధికంగా వస్తున్నారని వీటిని దృష్టిలో ఉంచుకొని గిరిజన ఆచార సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా బొజ్జికుప్ప, నారాయణరావుపేట ప్రాంతాల్లో గిరిజన మ్యూజియం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అనంతరం ఏకలవ్య పాఠశాలలో పారిశుద్ధ్యం లోపించడంతో పలువురు విద్యార్థులు రోగాల బారిన పడుతున్నారని కొంతమంది విద్యార్థుల తల్లిదండ్రులు లిఖితపూర్వకంగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ పర్యటనలో తహసీల్దార్ అశోక్‌కుమార్, గిరిజన మ్యూజియం ఇన్‌చార్జి వీరస్వామి, గిర్దావర్ నరసింహారావు, ఐదు మండలాల తహసీల్దార్, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

అనాథ చిన్నారులపై బాధ్యతగా శ్రద్ధ వహించాలి

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: అనాథ చిన్నారులపై బాధ్యత వహించి శ్రద్ధతో సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. స్థానిక శిశుగృహను గురువారం సందర్శించిన ఆయన ఆశ్రయం పొందుతున్న చిన్నారులకు అందుతున్న సౌకర్యాలపై డీడబ్ల్యూఓ స్వప్న కుమారిని వివరాలు అడిగి తెలుసుకున్నారు.

సమష్టి సహకారంతోనే అభివృద్ధి సాధ్యం: ఎమ్మెల్యే

పినపాక, న్యూస్‌టుడే: నియోజకవర్గ ప్రజల సమష్టి సహకారంతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. జానంపేట గ్రామస్థులందరూ కలిసి రూ. 2.50 లక్షలతో ఏర్పాటు చేసిన ప్రయాణ ప్రాంగణాన్ని ఎమ్మెల్యే గురువారం ప్రారంభించారు. గ్రామస్థులు పరస్పర సహకారంతో ముందుకు సాగుతున్న తీరును అభినందించారు. ఏడూళ్లబయ్యారం, జానంపేటలోని పలు ప్రైవేటు కార్యక్రమాలకు హాజరయ్యారు. తహసీల్దారు నరేశ్, ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీవో వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు రామనాథం, మండల నాయకులు పాల్గొన్నారు.



న్యాయవాదులతో న్యాయమూర్తి బత్తుల రామారావు

చట్టం, న్యాయాన్ని కాపాడాలి

దమ్మపేట, న్యూస్‌టుడే: న్యాయమూర్తి అన్ని వైపులా చట్టాన్ని న్యాయాన్ని కాపాడే విధంగా ఉండాలని న్యాయమూర్తి బత్తుల రామారావు అన్నారు. దమ్మపేట కోర్టులో న్యాయమూర్తిగా పనిచేసి పదోన్నతిపై కొత్తగూడెం బదిలీపై వెళ్తున్న రామారావు దంపతులకు స్థానిక కోర్టు ఆవరణలో సన్మాన సభ గురువారం నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మారం సతీష్‌కుమార్, కార్యదర్శి గొంతి మురళీమోహన్, న్యాయవాదులు ఉడతనేని శ్రీనివాస్, ఎం.శ్యాంసుధాకర్, లక్కినేని నరేంద్ర, సంజయ్, ఉదయ్, భవాని కృష్ణ, కాలం సంధ్యారాణి, అరుణకుమారి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం



ఎమ్మెల్యే డా.తెల్లం వెంకట్రావుకు వినతి పత్రం అందజేస్తున్న గిరిజన నాయకులు

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: కుమురంభీం జిల్లాలో ఏర్పాటు చేయనున్న కుమురం భీం విగ్రహం ప్రారంభానికి రావాల్సిందిగా భద్రాచలం ఎమ్మెల్యే డా.తెల్లం వెంకట్రావును గిరిజన నాయకులు గురువారం ఆహ్వానించారు. నాయకులు సత్యనారాయణ, ఉపేందర్, శ్రీనివాసరావు, సోమరాజు తదితరులు పాల్గొన్నారు.


అశ్వాపురం ఏడీగా బాధ్యతల స్వీకరణ

అశ్వారావుపేట, న్యూస్‌టుడే: అశ్వారావుపేట సబ్ డివిజన్‌కు ఎన్పీడీసీఎల్ ఏడీగా వి.వెంకటరత్నం గురువారం విధుల్లో చేరారు. అశ్వారావుపేట మండలానికి పలువురు సిబ్బంది బదిలీపై వచ్చారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేత

కరకగూడెం, న్యూస్‌టుడే: రేగళ్లలో ఖమ్మం జిల్లా కొల్లి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు కల్పనా చౌదరి ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు ఫౌండేషన్ కోఆర్డినేటర్ రూప్లానాయక్, కాంప్లెక్స్ హెచ్ఎం మోహన్ బాబు చేతుల మీదుగా నోటు పుస్తకాలు అందజేశారు. గురువారం పాఠశాలలోని 36 మంది విద్యార్థులకు 150 నోటు పుస్తకాలు అందజేసినట్లు కొల్లి ఫౌండేషన్ సంస్థ తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు వీరన్న పాల్గొన్నారు.

ఐద్వా అధ్యక్ష, కార్యదర్శులుగా విజయ, శమంతకమణి



అశ్వాపురం, న్యూస్‌టుడే: ఐద్వా మండల మహాసభ గురువారం అశ్వాపురంలోని సీఐటీయూ కార్యాలయంలో జరిగింది. కొప్పుల పద్మ మహాసభకు అధ్యక్షత వహించారు. మహిళలు సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలే శరణ్యమని మహాసభలో పలువురు వక్తలు పేర్కొన్నారు. అనంతరం మహాసభ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంది. అధ్యక్షురాలిగా పాయం విజయ, కార్యదర్శిగా మండేపూడి శమంతకమణి, కోశాధికారిగా పద్మ, మరో 9 మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఐద్వా నాయకులు కుంజా లక్ష్మి, రత్నకుమారి, వెంకటమ్మ, తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

నర్సింహారావు మృతిపై విచారణ

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: హరిత హోటల్‌లో పని చేస్తున్న ఇసంపల్లి నర్సింహారావును అకారణంగా పని నుంచి తొలగించారని, మనోవేదనతో బుధవారం మృతి చెందాడన్న ఆరోపణలపై మణుగూరు డీఎస్పీ, భద్రాచలం ఇన్‌ఛార్జి రవీందర్‌రెడ్డి గురువారం విచారణ చేపట్టారు. భద్రాచలం వచ్చిన ఆయన అక్కడే ఉన్న తెలంగాణ హరిత హోటల్స్ ఏజీఎం జంగయ్య, మేనేజరు నాగలక్ష్మితో మాట్లాడారు. హోటల్‌లో పనిచేసే పలువురు సిబ్బందిని ఆరా తీసి మృతి గల కారణాలపై సిబ్బందితో విడివిడిగా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అక్కడకు చేరుకొన్న ఎమ్మార్పీఎస్ నాయకులు నర్సింహారావు భార్యకు ఉద్యోగ అవకాశం కల్పించాలని ఏజీఎం జంగయ్యకు వినతిపత్రం అందజేశారు.

నిందితులపై బైండోవర్ కేసు

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: కేశవపట్నం, పెదనల్లబెల్లి, నడికుడి, నర్సాపురం గ్రామాల్లో నాటుసారా విక్రయిస్తున్న ఐదుగురు వ్యక్తులను ఎక్సైజ్ శాఖ అధికారులు గురువారం తహసీల్దార్ అశోక్‌కుమార్ ఎదుట హాజరుపరిచారు. ఐదుగురు వ్యక్తులు తరుచూ నాటుసారా విక్రయించడంతో బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై సీతారామరాజు తెలిపారు.

సంపులో పడిన కార్మికుడు

మణుగూరు పట్టణం, న్యూస్‌టుడే: మణుగూరు ఏరియా ఓసీ-4 గనిలో హాల్‌రోడ్ వద్ద ఉన్న సంపులో వోల్వో డ్రైవర్ ఉదయ్‌కిరణ్ గురువారం పడిపోయాడు. కార్మికుడు వాహనం దిగి సంపు వద్దకు రాగానే కాలు జారిపడ్డాడు. వెంటనే అతణ్ని ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం తరలించారు. ఘటనపై గని రక్షణ అధికారి లింగబాబును 'న్యూస్‌టుడే' వివరణ కోరగా... కార్మికుడు ప్రమాదవశాత్తు సంపులో పడ్డాడని, అతనికి ఎటువంటి ప్రమాదం లేదన్నారు.

ఐటీడీఏలో వాల్మీకి జయంతి

భద్రాచలం, దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: రామాయణం రాసిన వాల్మీకి జయంతిని రాముడు కొలువైన భద్రాచలంలో నిర్వహించుకోవడం ఎంతో ప్రత్యేకమైందని ఐటీడీఏ పీఓ రాహుల్ తెలిపారు. వాల్మీకి జయంతిని ఐటీడీఏలో గురువారం నిర్వహించారు. ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, డీడీ మణెమ్మ, ఆర్సీఓ నాగార్జునరావు, ఎస్డీసీ రవీంద్రనాథ్, రమణయ్య పాల్గొన్నారు.

★ దుమ్ముగూడెం మండలం ములకపాడు, నారాయణరావుపేట గ్రామాల్లో ఆదివాసీల పోరాట యోధుడు కుమురంభీం వర్ధంతి గురువారం నిర్వహించారు. నాయకులు దామోదర్‌రావు, కామరాజు, రాముడు, కామేష్, బొర్రయ్య, సీతయ్య, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మణుగూరు పట్టణం, కరకగూడెం, న్యూస్‌టుడే: మహర్షి వాల్మీకి గాథ ఎంతో స్ఫూర్తిదాయకమని మణుగూరు ఏరియా ప్రధాన అధికారి దుర్గం రామచందర్ తెలిపారు. మణుగూరు జీఎం కార్యాలయంలో గురువారం మహర్షి వాల్మీకి జయంతి నిర్వహించారు. ప్రత్యేక అధికారి శ్యామ్‌సుందర్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసు, రమేశ్, అనురాధ, శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.



మణుగూరు పట్టణం: భీం చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ప్రధాన అధికారి దుర్గం రామచందర్



అశ్వారావుపేటలో...

★ కరకగూడెం తహసీల్దార్ కార్యాలయంలో వాల్మీకి మహర్షి జయంతి గురువారం నిర్వహించారు. ఆర్ఐ హుస్సేన్, నరసింహారావు, కౌసల్య, కొండయ్య, నరేష్, హరీష్, రాజేష్, రవీంద్రకుమార్ పాల్గొన్నారు.

అశ్వారావుపేట, న్యూస్‌టుడే: అశ్వారావుపేటలోని వాల్మీకి విగ్రహానికి వాల్మీకి బోయ సంఘం ఆధ్వర్యంలో గురువారం పూజలు చేశారు. సంఘం నాయకుడు ఎంవీ రమణ మాట్లాడుతూ.. రామాయణ ఇతిహాసాన్ని రచించి వాల్మీకి మహర్షి అయ్యారని కొనియాడారు. నల్లబోతుల నాగు, శ్రీను పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి, న్యూస్‌టుడే: రామాయణ రచయిత వాల్మీకి మహర్షి జయంతిని తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ జగదీశ్వర ప్రసాద్ వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పించారు. ఆర్ఐ మధు, సిబ్బంది పాల్గొన్నారు.

కుమురం భీం ఆశయ సాధనకు కృషి



నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే పాయం

మణుగూరు పట్టణం, గుండాల, కరకగూడెం, న్యూస్‌టుడే: ఆదివాసీల దిక్సూచి కుమురం భీం ఆశయ సాధనకు తుడుందెబ్బ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుంపిడి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. కుమురంభీం వర్ధంతి పురస్కరించుకొని గురువారం గుండాలలోని ఆయన విగ్రహానికి నివాళి అర్పించారు. నాయకులు శంకరన్న, సీతారాములు, కృష్ణ, కన్నయ్య పాల్గొన్నారు.

★ మణుగూరు పట్టణంలోని అంబేడ్కర్‌కూడలిలో గురువారం కుమురంభీం వర్ధంతి నిర్వహించారు. ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కుమురంభీం విగ్రహానికి నివాళులర్పించారు. ఆదివాసీ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

★ కరకగూడెం మండలం భట్టుపల్లిలో ఆదివాసీ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో కుమురం భీం వర్ధంతి నిర్వహించారు. ఆదివాసీ ఐక్యవేదిక ప్రధాన కార్యదర్శి కలం సాంబమూర్తి, పోలెబోయిన రవి, కృష్ణయ్య, మలకం కుమారస్వామి, మోహన్‌రావు, తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

ములకలపల్లి, న్యూస్‌టుడే: వ్యక్తి అదృశ్యంపై ఠాణాలో కేసు నమోదైంది. ఎస్సై రాజశేఖర్ కథనం మేరకు.. జగన్నాథపురం గ్రామానికి చెందిన కందిమళ్ల జగదీశ్ మణుగూరుకి చెందిన సురేశ్ అనే లారీ డ్రైవర్ వద్ద క్లీనర్‌గా పని చేస్తున్నారు. జులై 9న సురేశ్ ఫోన్ చేయడంతో పని కోసం ఇంటి నుంచి వెళ్లిన జగదీశ్ రెండు నెలలు గడిచినా ఇంటికి తిరిగిరాలేదు. భార్య లారీ డ్రైవర్ సురేశ్, యజమాని హేమంత్‌ను చరవాణిలో సంప్రదించగా ఇంటికి వెళ్లిపోయారని వారు చెప్పారు. వెతికినా ఆచూకీ లభించలేదు. భార్య ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రహదారి ప్రమాదంలో పది మందికి గాయాలు

ములకలపల్లి, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో పది మందికి గాయాలైన ఘటన గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు..నల్లముడి, గండిప్రోలు గ్రామాలకు చెందిన సుమారు 25 మంది కొత్తగూడెంలో జరిగే ఓ సమావేశంలో పాల్గొనేందుకు ఆటోలో వెళ్తున్నారు. కొమ్ముగూడెం శివారులోని మలుపు వద్ద శునకం అడ్డు రావడంతో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో 8 మందికి స్వల్ప గాయాలు కాగా నల్లముడి గ్రామానికి చెందిన బానోత్ సునీతకు తల, కుడి భుజానికి తీవ్ర గాయాలయ్యాయి. వాడే జయ ఎడమ చేయి విరిగింది. క్షతగాత్రులను పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

ఆళ్లపల్లిలో గుట్కా పట్టివేత

ఆళ్లపల్లి, న్యూస్‌టుడే: మండలంలో కిరాణా దుకాణాల్లో విక్రయించేందుకు కాచనపల్లి నుంచి ద్విచక్ర వాహనంపై నిషేధిత గుట్కా ప్యాకెట్లను తరలిస్తున్న ఓ వ్యక్తిని ఆళ్లపల్లి పోలీసు ఠాణా సమీపంలో పోలీసులు బుధవారం పట్టుకున్నారు. అతని వద్ద రూ.12 వేల విలువైన గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఠాణాకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రతీశ్ తెలిపారు. ఈ తనిఖీల్లో ఏఎస్సై వెంకట్‌రెడ్డి, సిబ్బంది శ్రీనివాసరావు, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో చోరీ

పినపాక, న్యూస్‌టుడే: ఏడూళ్లబయ్యారం శ్రీషిర్డీ సాయిబాబా ఆలయంలో బుధవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ప్రధానార్చకుడు అంబడిపూడి ప్రసాదుశర్మ తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరద్వారం ధ్వంసం చేసి ఆలయంలోకి ప్రవేశించిన దొంగలు హుండీని పగులగొట్టి నగదు తీసుకెళ్లారు. చోరీపై ఏడూళ్లబయ్యారం ఠాణాలో ఫిర్యాదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీల ధర్నా

అశ్వారావుపేట, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అశ్వారావుపేట ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. సంఘ కార్యదర్శి జి.పద్మ మాట్లాడుతూ.. కేంద్రాలను ఉన్నతి చేశామన్న ప్రభుత్వం వారికి వేతనాలు ఇవ్వటంలో మాత్రం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని విమర్శించారు. అంగన్‌వాడీ టీచర్లకు కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రాధ, కృష్ణవేణి, రాజేశ్వరి, దుర్గ, లక్ష్మి, వెంకటరమణ, పిట్టల అర్జున్ పాల్గొన్నారు.

దమ్మపేట, న్యూస్‌టుడే: అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జి.పద్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దమ్మపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సూరమ్మ, జ్యోతి, జయ, స్రవంతి పాల్గొన్నారు.



ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

ఇళ్లను తొలగిస్తే న్యాయం చేయాలి

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: తమ ఇళ్లను తొలగిస్తే మాకు తగిన న్యాయం చేయాలని భద్రాచలం ఆర్డీఓ దామోదర్‌రావును ఇళ్ల యజమానులు కోరారు. భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామి ఆలయానికి సమీపంలో ఉన్న ఇళ్ల యాజమానులతో స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ దామోదర్‌రావు గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధిలో భాగంగా ఇళ్లను తొలగించాల్సిన అవసరం ఏర్పడిందని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. బాధితులకు తగిన న్యాయం చేసేందుకు ప్రభుత్వం సమాలోచనలు చేసిందని వెల్లడించారు. దీనిపై బాధితులు మాట్లాడుతూ.. ఎవరెవరికి ఎంత నష్టపోతున్నారో ఏ మేరకు వారికి నష్టపరిహారం అందుతుందనే దానిపై ఇంకా పూర్తి అవగాహన లేదన్నారు. తొలగించాల్సిన ఇళ్లను కావాల్సిన స్థలాన్ని మార్కింగ్ చేసిన అనంతరం నష్టపరిహారం విషయంపై పూర్తి స్పష్టత వచ్చే వీలున్నట్లు వారు భావిస్తున్నారు. సమావేశంలో ఇళ్ల యాజమానులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

రిమోట్ బోట్ ఆపరేటింగ్‌పై సిబ్బందికి నైపుణ్య శిక్షణ

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు నదుల్లో ప్రాణాపాయస్థితిలో ఉన్న వారిని రిమోట్ బోట్‌ను పంపించి ఎలా కాపాడాలి? అనే విధానంపై రిమోట్ బోట్ ఆపరేటింగ్‌ను అగ్నిమాపక సిబ్బందికి నైపుణ్య శిక్షణ భద్రాచలంలో ఏర్పాటు చేశారు. ముంబయికి చెందిన శ్రీలలిత కంపెనీకి చెందిన శిక్షణ నిపుణుడు మనోజ్ సావన్ సిబ్బందికి ఈ శిక్షణను గురువారం ఇచ్చారు. రెండు రోజుల పాటు నిర్వహించే శిక్షణా కార్యక్రమంలో మొదటి రోజు ఉమ్మడి ఖమ్మం, సూర్యాపేట, నల్గొండ జిల్లాలకు చెందిన 35 మంది అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.



నైపుణ్య శిక్షణలో పాల్గొన్న అగ్నిమాపక సిబ్బంది


మండల విద్యాధికారులొచ్చారు..

మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే

విద్యావ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. పర్యవేక్షణ తగ్గి విద్యావ్యవస్థ కుంటుపడిందని గుర్తించిన ప్రభుత్వం ప్రతి మండలానికి ఎంఈవోలను నియమించింది. ఆ మండలంలో పనిచేసే సీనియర్ గెజిటెడ్ హెచ్ఎంలకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ నెలరోజుల క్రితమే ఉత్తర్వులు జారీ చేయడంతో పినపాక నియోజకవర్గంలోని ఏడు మండలాలకు ఏడుగురు ఎంఈవోలు బాధ్యతలు చేపట్టారు. గతంలో ఒక్కో ఎంఈవో మూడు నుంచి ఐదు మండలాల బాధ్యతలు చూస్తుండేవారు. ఈ క్రమంలో పనిభారంతో తీవ్రంగా సతమతమవుతుండేవారు. ఉపాధ్యాయులకు అవసరమున్నప్పుడు ఎంఈవో ఎప్పుడు ఎక్కడ ఉంటాడో తెలియక ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ప్రతి మండలానికి ఎంఈవో రావడంతో ఇబ్బందులు తప్పనున్నాయి.

ఎంఈవోల వివరాలు..

మండలం	ఎంఈవో
బూర్గంపాడు	యదుసింహరాజు
మణుగూరు	స్వర్ణజ్యోతి
పినపాక	నాగయ్య
కరకగూడెం	మంజుల
గుండాల	పార్వతి
అశ్వాపురం	వీరస్వామి
ఆళ్లపల్లి	శాంతారావు



గతంలో నాలుగైదు మండలాలకు కలిపి ఒక్కరే ఎంఈవో ఉండటంతో పనిభారంతోపాటు విధులను పూర్తిస్థాయిలో నిర్వర్తించేందుకు అవకాశం ఉండేదికాదు. కానీ ప్రస్తుతం మండలాల వారీగా ఎంఈవోలను కేటాయించడంతో విద్యావ్యవస్థను బలోపేతం చేస్తూ, విద్యాభివృద్ధిని మెరుగుపర్చేందుకు అవకాశం లభిస్తుంది.

– స్వర్ణజ్యోతి, ఎంఈవో, మణుగూరు

కల్యాణ మండపం వద్ద షెడ్డు ఏర్పాటు



కల్యాణ మండపం వద్ద ప్రారంభమైన పనులు

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ప్రాంగణంలోని మిథిలా మండపం వద్ద శాశ్వత షెడ్డు నిర్మాణ పనులు ఆరంభించారు. ఈ మండపంలో ప్రతి శ్రీరామ నవమికి కల్యాణం చేస్తారు. ఆ తర్వాత రోజు పట్టాభిషేకం ఉంటుంది. ఇందులో మొత్తంగా 30 వేల మంది కూర్చొని ప్రత్యక్షంగా కల్యాణం వీక్షించవచ్చు. ఉత్తర ద్వారం ఎదుట నుంచి మిథిలా మండపం వరకు కొంతమేర మాత్రమే శాశ్వత షెడ్డు ఉంది. ఉత్సవాల తరుణంలో తాత్కాలిక చలువ పందిరి నిర్మాణాలు చేస్తుంటారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రసాద్ పథకంలో భాగంగా ఇక్కడ సుమారు రూ.కోటితో రేకులతో శాశ్వత షెడ్డును నిర్మించేందుకు చర్యలు చేపట్టారు. జేసీబీ సాయంతో పునాది తవ్వకాలు చేస్తున్నారు. ఇది సుమారు రెండు వేల మందికి నీడనివ్వనుంది. సాధారణ రోజుల్లో వచ్చే భక్తులకు ఉచిత వసతి అందించేందుకు దోహద పడనుంది. భవిష్యత్తులో బక్కెట్ కుర్చీలను కల్యాణ మండపం వద్ద ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలు ఉన్నందున ఈ ప్రాంగణాన్ని సుందరీకరించనున్నారు. రూ. 42 కోట్లతో ప్రసాద్ పథకం ద్వారా భద్రాచలం, పర్ణశాలలో పనులు చేస్తున్నారు. ఇప్పటికే కొన్ని నిర్మాణాలు కొనసాగుతుండగా రానున్న రోజుల్లో రామాలయ వద్ద అభివృద్ధి పనులు చేయనున్నారు.

కొత్తగూడెం

• కొత్తగూడెం • ఇల్లెందు

మధ్యాహ్న భోజనం నాణ్యత పరిశీలన



భోజనం రుచిచూస్తున్న డీఈఓ వెంకటేశ్వరాచారి, ప్రభుదయాళ్

కొత్తగూడెం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన మధ్యాహ్న భోజనాన్ని వడ్డించాలని డీఈఓ ముమ్మడి వెంకటేశ్వరాచారి అన్నారు. కొత్తగూడెం రామవరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను గురువారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. మధ్యాహ్న భోజన వంట నిర్వహణ తీరును పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనాన్ని రుచి చూశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ప్రభుదయాళ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'కార్పొరేషన్ వద్దు... పంచాయతీ మేలు'

సుజాతనగర్, న్యూస్‌టుడే: కొత్తగూడెం కార్పొరేషన్ ప్రతిపాదన పరిధిలో ఉమ్మడి సుజాతనగర్ పంచాయతీని కలపొద్దని, ఉన్నతాధికారులు ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి వీర్ల రమేశ్ అన్నారు. పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సమావేశం నిర్వహించారు. కార్పొరేషన్ ఏర్పాటుతో సుమారు 2 వేల మందికి ఉపాధి హామీ పనులు దూరమవుతాయన్నారు. పన్నుల భారం పెరుగుతుందన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
కొత్తగూడెం: 8008573723
పాల్వంచ: 9550076766
ఇల్లెందు: 9154846689



సమస్య: మండలంలోని 4వ ఇంక్లైన్ ఐటీఐ కళాశాల వెనుక మిషన్ భగీరథ తాగునీరు పైపులైన్ల మరమ్మతులు నత్తనడక సాగుతున్నాయి. తాగునీటి సరఫరా పూర్తి స్థాయిలో జరగడం లేదు. పనులు సత్వరం పూర్తిచేయించాలి. **- ఓ పాఠకుడు**

సమాధానం: పైపులైన్ల మరమ్మతులు వేగంగా పూర్తిచేసి, కొద్ది రోజుల్లోనే తాగునీటి సమస్య తీరుస్తాం. **- వసంత, ఏఈ, మిషన్ భగీరథ ఇంట్రా విలేజ్**

– చుంచుపల్లి, న్యూస్‌టుడే

పాల్వంచ బసవతారకకాలనీ బృహత్ పల్లె ప్రకృతి వనంలో పిచ్చిమొక్కలు పెరిగాయి. పార్కులోకి వెళ్లే వాకర్స్ ఇబ్బంది పడుతున్నారు. **- శ్రీనివాస్, స్థానికుడు**

✔ గ్రామ పంచాయతీ కార్యదర్శి, సిబ్బందితో మాట్లాడి సమస్య పరిష్కరిస్తాం.
- నారాయణ, ఎంపీవో

– పాల్వంచ పట్టణం, న్యూస్‌టుడే



ప్రకాశం మైదానంలో వాకింగ్ చేయడానికి ఇబ్బంది పడాల్సి వస్తోంది. ట్రాక్ చుట్టూ పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి విష పురుగులు వస్తున్నాయి.
- నడక సాధకులు

✔ మైదానంలో పిచ్చి మొక్కలను తొలగించేందుకు తగిన చర్యలు తీసుకుంటాం.
- పాస్‌నెట్, మైదానం ఇన్‌ఛార్జి

– కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే

రుద్రంపూర్ బీక్లాస్, ఎస్సీ క్వార్టర్ల వద్ద దోమల బెడద అధికంగా ఉంది. ఆవులు, పందుల సంచారం కూడా అధికంగా ఉంటోంది. ఈ ప్రాంతంలోని సమస్యలను పరిష్కరించాలి. **- అరుణ్‌కుమార్**

✔ సివిల్ విభాగం సిబ్బందితో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తాం. **జీఎం షాలేమురాజు**

– కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే

పాల్వంచ బ్యాంక్ కాలనీలో డ్రైనేజీ పూడిక తీయకపోవడంతో మురుగునీరు పారడం లేదు. దుర్వాసన వస్తోంది. **వేణు, స్థానికుడు**

✔ సంబంధిత ఏరియా జవాన్‌కు చెప్పి సమస్య పరిష్కరిస్తాం.
- కేవీ లక్ష్మణ్‌రావు, పారిశుద్ధ్య అధికారి

– పాల్వంచ, న్యూస్‌టుడే

ఏడీఈగా రవికుమార్ బాధ్యతల స్వీకరణ



సుజాతనగర్, న్యూస్‌టుడే: ఏడీఈ ఎం.రవికుమార్ సుజాతనగర్‌లోని తన కార్యాలయంలో గురువారం బాధ్యతలు స్వీకరించారు. సుజాతనగర్, చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి, జూలూరుపాడు మండలాల పరిధిలో ట్రాన్స్‌కో విధులను ఆయన చూస్తారు. ఏఈలు కిషన్, నర్సింహారావు, తరుణ్, సతీశ్‌లు ఏడీఈకి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. సబ్‌ఇంజినీర్ శివకుమార్, సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు, వెంకట్రావు, విశ్రాంత ఎల్.ఐ. మల్లికార్జున్‌రావు పాల్గొన్నారు.

జూలూరుపాడు ఎంఈఓగా జుంకీలాల్

జూలూరుపాడు, న్యూస్‌టుడే: జూలూరుపాడు మండల విద్యాధికారిగా జుంకీలాల్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. పడమటినర్సాపురం ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్న ఆయనను ఇటీవల ప్రభుత్వం మండల విద్యాధికారిగా నియమించింది. బాధ్యతలు చేపట్టిన సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు, సంఘం నాయకులు ఆయనను మండల వనరుల కేంద్రంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు.

వెంకటేశ్ ఖనికి తొలగిన అడ్డంకులు

ఎట్టకేలకు స్టేజ్-1 అనుమతులు మంజూరు

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే

కొత్తగూడెం ఏరియాలో అతిపెద్ద గనిగా అవతరించనున్న వీకే (వెంకటేశ్ ఖని) ఉపరితల గని ఏర్పాటులో కీలక అడుగు ముందుకు పడింది. తొలిదశ (స్టేజ్-1) అనుమతులు ఎట్టకేలకు లభించాయి. దీంతో నల్లనేలలో మరో కొత్త గనిలో ఉత్పత్తికి మార్గం సుగమమైంది.

వీకే ఓసీ స్టేజ్-1 అనుమతుల కోసం అనేక సమస్యలను యాజమాన్యం అధిగమించాల్సి వచ్చింది. దశల వారీగా చర్యలు తీసుకుని సఫలమైంది. రెండేళ్ల క్రితమే ఉత్పత్తి ప్రారంభమవుతుందని భావించారు. గత ఏడాది వార్షిక లక్ష్యాన్ని సైతం కేటాయించారు. కానీ కరోనా తదనంతర పరిణామాలు, ప్రజాభిప్రాయ సేకరణ, నివాస ప్రాంతాల ఖాళీ, నిర్వాసితుల ప్రత్యామ్నాయ స్థలం కేటాయించడం వంటి అంశాలతో అనుమతుల ప్రక్రియ జాప్యమవుతూ వచ్చింది. 350 మంది వరకు నిర్వాసితులను గుర్తించి వారికి స్థానిక పాత మ్యాగజైన్ ప్రాంతంలో ప్రత్యామ్నాయ భూమిని కేటాయించారు. ప్రభుత్వ అనుమతులను కూడా పొందారు. చివరగా అటవీ శాఖకు గని కింద ప్రత్యామ్నాయ భూమిని అప్పగించే దశలో పెద్ద అవాంతరం ఏర్పడింది. ఆ భూమి అన్యాక్రాంతం కావడంతో ములుగు ప్రాంతంలో సింగరేణి సంస్థ గనుల అవసరాలకు హక్కులను పొందిన భూమిని అటవీశాఖకు ఇవ్వడంతో స్టేజ్ 1 అనుమతులు ఇటీవల లభించాయి.



వీకే ఉపరితలగనిగా విస్తరించనున్న జీకే ఉపరితలగని ఇదే

స్టేజ్–2 అనుమతుల ప్రక్రియ ప్రారంభం
- షాలేమురాజు, ఏరియా జీఎం

వీకే మైన్ ఏర్పాటుకు అడుగడుగునా అవాంతరాలు ఏర్పడ్డాయి. ఇన్నాళ్లకు వాటిని అధిగమించడంతో కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ నుంచి అటవీ అనుమతులు దక్కాయి. ప్రస్తుతం గనికి స్టేజ్ 2 అనుమతులు లభించాల్సి ఉంది. సింగరేణి చూపించిన ప్రత్యామ్నాయ భూములను అటవీ శాఖ నోటిపై చేయాల్సి ఉంటుంది. అది పూర్తయితే రెండో దశ అనుమతులు లభిస్తాయి. దీనికి మరో మూణ్నెల్ల నుంచి ఆర్నెల్లు పట్టే అవకాశం ఉంది. ఆ తర్వాత ఉత్పత్తి పనులు లాంఛనంగా మొదలవుతాయి.

అతిపెద్ద గనిగా వీకే ఉపరితలగని

సాలీనా 5.3 మిలియన్ టన్నుల బొగ్గును అందించగల సామర్థ్యం వీకే ఓసీ సొంతం. కొత్తగూడెం ఏరియాలో ఇదే అతి పెద్ద ఉపరితల గనిగా నిలవనుంది. ప్రస్తుతం కొత్తగూడెంలోని వీకే-7 భూగర్భ గని మూతపడింది. జీకే ఉపరితల గనిలోనూ బొగ్గు నిల్వలు నిండుకోనున్నాయి. ఈ రెండింటితో పాటు పీవీకే-5 గనిని కలుపుతూ పరిసర ప్రాంతాల్లోనే కొత్తగా వెంకటేశ్ ఖని ఓసీని యాజమాన్యం ప్రతిపాదించింది. పాత గనుల విలీనం దశల వారీగా చేపట్టాలనేది ప్రణాళిక. తొలిదశలో ప్రస్తుత జీకే ఓసీని విస్తరిస్తూ వెళ్తారు. ఆ తర్వాత వీకే-7 భూగర్భ గని పైనున్న నిల్వలను వెలికితీస్తారు. ఇందుకు కనీసం తొమ్మిదేళ్లకు పైగా సమయం పడుతుందని అంచనా. అప్పటి లోగా పీవీకే-5 గనిలో బొగ్గు నిక్షేపాలు నిండుకునే వీలుంది. మూడో దశలో దాన్నీ విలీనం చేసుకోవడం ద్వారా ఓ దశాబ్దంలో మూడు గనులను కలుపుతూ జిల్లాలోనే అతిపెద్ద గనిగా వీకే ఓసీ అవతరించనుంది.

వరిలో ఎండు ఆకు తెగులు వ్యాప్తి

సుజాతనగర్, న్యూస్‌టుడే: మండలంలో వరిలో ఎండు ఆకు తెగులు వ్యాప్తిని గుర్తించినట్లు మండల వ్యవసాయాధికారి నర్మద తెలిపారు. సుజాతనగర్‌లోని పొలాలను గురువారం ఆమె పరిశీలించారు. రైతులు ఆందోళన చెందొద్దని.. తెగులు నివారణకు ఎకరాకు 80 గ్రాముల అగ్రిమైసిన్ లేదా 40 గ్రాముల ప్లాంటామైసిన్, 600 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్‌ను పిచికారీ చేయాలని సూచించారు.

బాధితులకు సత్వర న్యాయమందించాలి: డీఎస్పీ

పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే: ఠాణా పరిధిలోని కేసులను త్వరితగతిన పరిష్కరించి బాధితులకు సత్వర న్యాయం చేయాలని డీఎస్పీ సతీశ్‌కుమార్ ఆదేశించారు. ములకలపల్లి, అశ్వారావుపేట, బూర్గంపాడు, పాల్వంచ ఠాణాల సమీక్షను ఎస్సైలతో కలిసి గురువారం పోలీస్ సబ్ డివిజన్ కార్యాలయంలో డీఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐ వినయ్, ఎస్సైలు సుమన్, రామయ్య, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన భారాస మండలాధ్యక్షుడు



లక్ష్మీదేవిపల్లి: భారాస మండలాధ్యక్షుడు కొట్టె వెంకటేశ్వర్లు హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌ను గురువారం కలిశారు. 'పేదింపులపై ఆలోచించి' పోరుబాటపై అంశాలను ఆయనకు వివరించారు. 'ప్రజల పక్షాన పనిచేయాలని' కేటీఆర్ ఆయనకు సూచించారు.

ప్రొ.సాయిబాబా ఆశయ సాధనకు కృషి

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: మానవ హక్కుల సంఘం నేత ప్రొ.సాయిబాబా ఆశయాలను సాధనకు కృషిచేయాలని న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు జె.సీతారామయ్య అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సాయిబాబా చిత్రపటానికి గురువారం నివాళులు అర్పించారు. సీతారామయ్య మాట్లాడుతూ.. ఆదివాసీల సమస్యలపై వైకల్యాన్ని లెక్క చేయకుండా సాయిబాబా పోరాటం చేశారన్నారు. ఆయన్ను అన్యాయంగా జైలులో నిర్బంధించారని ఆరోపించారు. నాయకులు రమేశ్, చారి, ఉపేందర్ రావు, మహేందర్, శ్రీనివాస్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్తు తీగలు




సుజాతనగర్‌లోని అంబేడ్కర్ నగర్‌లో ఇళ్ల మధ్య నియంత్రిక ప్రమాదకరంగా ఉంది. విద్యుత్తు తీగలు నివాసాల మీదుగా తక్కువ ఎత్తులో వెళ్తున్నాయి. విద్యుత్తు శాఖ అధికారులు స్పందించి తీగలను గృహ సముదాయాల నుంచి పక్కకు మార్చాలని మాజీ ఉపసర్పంచి నాయకులు వేల్పుల భాస్కర్, వెంకటేశ్వర్లు, చంటి, మీరాబీ, కోటేశ్వరి, రాంబాబు కోరుతున్నారు.

★ లైన్ మార్పునకు రూ.6.10 లక్షల ప్రతిపాదనలతో చేశామని, దీనికి సంబంధించి పంచాయతీ వారు రూ.1.50 లక్షలు చెల్లిస్తే సమస్యను పరిష్కరిస్తామని ఏఈ కిషన్ 'న్యూస్‌టుడే'కి తెలిపారు.

– సుజాతనగర్, న్యూస్‌టుడే

జింకను పోలినట్టు.. తాపీగా కూర్చునేట్టు!



ఇల్లెందు జేకే సీఈఆర్ క్లబ్‌లోని ఓ తీగజాతి చెట్టు కాండం.. మాడగానే జింక ఆకృతిని పోలిఉంది. పైగా కూర్చునేందుకు వీలుగా వంపు తిరిగి, పచ్చదనంతో కనిపిస్తుండటంతో చిన్నారులు, పెద్దలు దాని వద్దకు ఆసక్తిగా వెళ్తున్నారు.

– ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే

విలీన సభ విజయవంతానికి పిలుపు

జూలూరుపాడు, న్యూస్‌టుడే: సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈనెల 20న విలీన సభను నిర్వహించనున్నట్లు, ఈ విలీన సభను జయప్రదం చేయాలని సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఏదులాపురం గోపాలరావు పిలుపునిచ్చారు. గురువారం జూలూరుపాడు మండలంలోని కస్తూర్బాగాంధీ విద్యాలయంలో గోడప్రతులు ఆవిష్కరించారు.

వాల్మీకి జయంతి వేడుకలు

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: వాల్మీకి జయంతి వేడుకలను సింగరేణి యాజమాన్యం ఆధ్వర్యంలో కార్పొరేట్ కార్యాలయం, ఏరియా జీఎం కార్యాలయంలో గురువారం నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి డైరెక్టర్ సత్యనారాయణరావు, జీఎంలు సుబ్బారావు, శామ్యూల్ సుధాకర్, మనోహర్‌లు నివాళి అర్పించారు. కొత్తగూడెం ఏరియాలో జరిగిన వేడుకల్లో ఎస్వోటూ జీఎం కోటిరెడ్డి పాల్గొన్నారు. జడ్పీ కార్యాలయంలో జడ్పీ సీఈవో బి.చంద్రశేఖర్ వాల్మీకి చిత్రపటానికి నివాళి అర్పించారు.

పాల్వంచ, న్యూస్‌టుడే: కేటీపీఎస్ ఐదు, ఆరు దశల సీఈ మేక ప్రభాకర్‌రావు ఆధ్వర్యంలో వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పించారు. ఎస్‌ఈలు వెంకటేశ్వర్లు, దర్శారావు, ఎస్పీఎఫ్ ఆర్ కిరణ్, యర్ర శ్రీనివాస్, బాగం రాధాకృష్ణ పాల్గొన్నారు.

టేకులపల్లి, న్యూస్‌టుడే: బోడులో వాల్మీకి బోయ కులస్థుల ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. మహర్షి చిత్రపటంతో శోభాయాత్ర నిర్వహించారు. అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో వాల్మీకి బోయ సంఘం జిల్లా అధ్యక్షుడు ముకిరి వెంకన్న, బోయ కులస్థులు మీనుగు సురేశ్, ముకిరి సత్యనారాయణ, కేగర్ల హనుమంతు, కేగర్ల శ్రీనివాస్, మీనుగు జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.



కొత్తగూడెం సింగరేణి: మాట్లాడుతున్న డైరెక్టర్ సత్యనారాయణరావు



టేకులపల్లి: బోడులో బోయ కులస్థుల పూజలు

క్రీడా ఏర్పాట్ల పరిశీలన



వ్యాయామ ఉపాధ్యాయులతో చర్చిస్తున్న డీడీ మణెమ్మ

పాల్వంచ పట్టణం, న్యూస్‌టుడే: మండలంలోని కిన్నెరసాని క్రీడా పాఠశాల వేదికగా శుక్ర, శనివారాల్లో జరగనున్న జిల్లా స్థాయి క్రీడల ఏర్పాట్లను ఐటీడీఏ డీడీ మణెమ్మ గురువారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ.. తొమ్మిది క్రీడాంశాలకు సంబంధించిన కోర్టులు, సామగ్రిని లోపాలు లేకుండా ఏర్పాట్లు చేసుకోవాలని క్రీడల అధికారి గోపాలరావుకు సూచించారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో కోర్టులను పరిశీలించి పీడీలకు పలు సూచనలు చేశారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

కొత్తగూడెం నేరవిభాగం, న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు రెండో పట్టణ పోలీసులు గురువారం తెలిపారు. చుంచుపల్లి మండలం 4వ ఇంక్లైన్ పంచాయతీ బంగ్లోస్ ప్రాంతంలో నివాసముంటున్న పెయింటర్ గమ్మికుంట కనకరాజు (32).. అదే ఏరియాలోని ఓ భవనానికి రంగులు వేసే పనులను ఒప్పుకొన్నారు. రంగులు వేసేందుకు పై అంతస్తు వద్ద పరంజా కడుతుండగా పక్కనున్న 11 కేవీ తీగలు తగిలి విద్యుదాఘాతానికి గురయ్యారు. కిందపడిపోయిన అతణ్ని స్థానిక సర్వజన ఆసుపత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ మరణించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

సుజాతనగర్, న్యూస్‌టుడే: రెండు కార్లు, ఒక ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటన గురువారం మండలంలో చోటుచేసుకుంది. మంగపేటకు చెందిన గుగులోత్ శంకర్ ద్విచక్రవాహనంపై కొత్తగూడెం వెళ్లేందుకు గ్రామంలోని డివైడర్‌ను దాటుతున్నాడు. ఆయన్ను చూసి ఖమ్మం నుంచి కొత్తగూడెం వెళ్లే కారు నెమ్మదించింది. దానిని వెనుక నుంచి వేగంగా వచ్చిన మరో కారు ఢీకొంది. దీంతో నెమ్మదించిన కారు ముందుకు కదిలి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో శంకర్ రోడ్డుపై పడిపోయాడు. తలకు తీవ్రగాయాలపై అపస్మారక స్థితిలోకి చేరగా.. ఎస్సై జుబేదాబేగం క్షతగాత్రుణ్ని కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడ్నుంచి ఖమ్మం తరలించి చికిత్స అందిస్తున్నారు. రెండు కార్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

పాతకక్షతో దాడి.. మహిళపై కేసు

పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే: తెలంగాణనగర్‌లో షేక్ సకీనా పర్వీన్, పుష్పలకు ఫ్యాన్సీ షాపులున్నాయి. పాతకక్షతో పుష్ప గురువారం పర్వీన్‌ను దూషిస్తూ దాడి చేసింది. బాధితురాలి ఫిర్యాదుతో ఎస్సై సుమన్ పుష్పపై కేసు నమోదు చేశారు.

40 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే: పాల్వంచ నుంచి లక్ష్మీపురంలో ఉన్న రైస్ మిల్లుకు బొలేరోలో తరలిస్తున్న 40 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గురువారం సాయంత్రం ఎస్సై సురేశ్ పట్టుకున్నారు. డ్రైవర్ అశోక్, ఓనర్ హరీశ్, రైస్‌మిల్ నిర్వాహకుడు సతీశ్‌పై కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోండి



డీఈఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న నాయకులు

పాల్వంచ, న్యూస్‌టుడే: డీఎస్సీ ఉపాధ్యాయుల కౌన్సెలింగ్‌లో అక్రమాలకు పాల్పడిన డీఈఓను తొలగించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాజు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కిశోర్‌సింగ్, కృష్ణ ఆరోపిస్తూ డిమాండ్ చేశారు. డీఈఓ కార్యాలయం ఎదుట గురువారం ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ.. పోస్టులకు ఖాళీలున్న ప్రాంతాల్లో కాకుండా ఇతర చోట్ల పోస్టులు కేటాయించిన డీఈఓ కార్యాలయ ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని కోరారు. పద్మారాణి, మల్లెంపాటి వెంకటేశ్వర్లు, రాజయ్య, దాసు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అడవి బిడ్డల స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలకు భీం పోరాటం

పాల్వంచ, న్యూస్‌టుడే: జల్, జంగల్, జమీన్ నినాదంతో అడవి బిడ్డల స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలకు పోరాటం చేసిన యోధుడు కుమురం భీం అని రాష్ట్ర నాయకుడు సోయం సత్యనారాయణ, ఆరే ప్రశాంత్ అన్నారు. పాల్వంచ ఇందిరానగర్ కాలనీలోని కుమురం భీం భవనంలో భీం వర్ధంతి సభను గురువారం నిర్వహించారు. భీం విగ్రహానికి నాయకులు శ్రీరాములు, నాగరాజు తదితరులు నివాళి అర్పించారు.

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: కుమురం భీం వర్ధంతి సందర్భంగా ఇల్లెందులో తుడుందెబ్బ ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. కొత్తబస్టాండ్ వద్దనున్న భీం విగ్రహానికి సంఘం జాతీయ కన్వీనర్ రమణాల లక్ష్మయ్య, సీఐ బత్తుల సత్యనారాయణ, నాయకులు ఈసం కృష్ణ, ధనసరి రామ్మూర్తి, వి.కన్నయ్య, పూనెం బాలకృష్ణ తదితరులు నివాళులర్పించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ టి.ప్రభాకర్ రావు, అధ్యాపకులు కుమురం భీం చిత్రపటానికి నివాళులర్పించారు.



పాల్వంచ: భీం విగ్రహానికి నాయకుల నివాళి



ఇల్లెందు కొత్తబస్టాండ్ వద్ద తుడుందెబ్బ నాయకులు, సీఐ సత్యనారాయణ..

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

జూలూరుపాడు, న్యూస్‌టుడే: సహకార బ్యాంకు సేవలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని, ఆర్థిక అక్షరాస్యతపై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలని పీఏసీఎస్ ఛైర్మన్ చీమలపాటి భిక్షం అన్నారు. జూలూరుపాడు సొసైటీ కార్యాలయంలో గురువారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. బ్రాంచి మేనేజర్ మానుష, సూపర్‌వైజర్ నరేశ్, సొసైటీ కార్యదర్శి రమణారెడ్డి పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం

జూలూరుపాడు, న్యూస్‌టుడే: జూలూరుపాడు(వెంగన్నపాలెం)లోని సాయిబాబా ఆలయం వార్షికోత్సవం సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఆలయ కమిటీ ఛైర్మన్ లేళ్ల వెంకటరెడ్డి దంపతులు పూజలకు హాజరయ్యారు.

విన్నపాలు వినవలె..

నిర్వాసితులుగా గుర్తించరూ..: ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: ఇల్లెందు జేకే 5 ఉపరితల గని విస్తరణ నేపథ్యంలో తమను కూడా నిర్వాసితులుగా గుర్తించాలని తిలక్‌నగర్ పంచాయతీ కుమ్మరిబస్తీ వాసులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం నిరసన వ్యక్తం చేశారు. తహసీల్దార్ రవికుమార్‌కు రాజు, శ్రీనివాస్, సుమలత, జ్యోతి, సత్యవతి, సోయ్య, శ్రీనివాస్, తులసి తదితరులు వినతిపత్రం అందజేశారు.

ఉపాధ్యాయినులకు వేతనాలేవీ?..: టేకులపల్లి: మినీ అంగన్‌వాడీలు ప్రధాన అంగన్‌వాడీలుగా మారినా ప్రభుత్వం ఇంకా ఉపాధ్యాయినులకు ఆ స్థాయి వేతనాలను ఐదు నెలలుగా విడుదల చేయడం లేదని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అబ్దుల్ నబీ అన్నారు. వేతనాలు చెల్లించాలని టేకులపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద గురువారం ఆందోళన నిర్వహించారు. ప్రాజెక్టు కార్యదర్శి కె.శకుంతల పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవనాలు నిర్మించాలని..: కొత్తగూడెం కలెక్టరేట్: కొత్తగూడెం 35వ వార్డు గాజులరాజం బస్తీలో అంగన్‌వాడీలకు నూతన భవనాలు నిర్మించాలని కౌన్సిలర్ రుక్మాంగదర్ బండారి జిల్లా సంక్షేమాధికారి స్వర్ణలత లెనినాకు గురువారం కలెక్టరేట్‌లో కలిసి వినతిపత్రమిచ్చారు. మొత్తం 3 అంగన్‌వాడీల్లో అన్నీ అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయని ఆయన పేర్కొన్నారు.

వైద్య సిబ్బందిని నియమించాలని..: పాల్వంచ: పాల్వంచ సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ)లో వైద్యులు, సిబ్బంది కొరత తీర్చాలని.. సీఆర్మ్, డిజిటల్ ఎక్స్‌రేతో పాటు రోగులకు అన్ని వసతులు కల్పించాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు గంధం మల్లికార్జునరావు ఆధ్వర్యంలో ఆసుపత్రి ఎదుట గురువారం ఆందోళన చేపట్టారు. ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్, రంజిత్, నాగరాజు, రమేశ్ పాల్గొన్నారు.

ఇళ్ల కమిటీల్లో వారికీ చోటివ్వండి: పాల్వంచ గ్రామీణం: ఇందిరమ్మ ఇళ్ల కమిటీల్లో అధికార పార్టీతో పాటు పార్టీల నాయకులకు చోటు కల్పించి పారదర్శకత పాటించాలని, అప్పుడే ఇళ్ల కేటాయింపులో అర్హులకు న్యాయం జరుగుతుందని పీవోడబ్ల్యూ జిల్లా ఉపాధ్యక్షురాలు సోమా వినోద అన్నారు. రెడ్డిగూడెంలో గురువారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు.

అసాంఘిక శక్తులకు వనరు

నిరుపయోగంగా విద్యాశాఖ రిసోర్సు సెంటర్

లక్ష్మీదేవిపల్లి, న్యూస్‌టుడే

సొంత భవనాల్లేక.. కొత్తగా వాటిని నిర్మించుకునేందుకు స్థలాల్లేక కొన్ని శాఖలు ఇబ్బంది పడుతున్నాయి. కానీ, చుంచుపల్లి మండల కేంద్రంలో విద్యా శాఖ పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. సొంత స్థలంలో ఏళ్ల క్రితం నిర్మించి భవనం నిరుపయోగంగా ఉన్నా పట్టించుకోవడం లేదు. దీంతో అది గంజాయి, మందుబాబులు వంటి అసాంఘిక శక్తులకు నిలయంగా మారుతోంది. విద్యానగర్ పంచాయతీలోని మండల విద్యా వనరుల కేంద్రాన్ని వినియోగంలోకి తేవాలని ఆ శాఖ సిబ్బంది కోరుతున్నారు.



మండల విద్యా వనరుల కేంద్రం

ఎమ్మార్సీ భవనాన్ని నిర్మించి 17 ఏళ్లకు పైగా అవుతోంది. మండల రిసోర్స్ పర్సన్(ఎమ్మార్పీ)లు, విద్యా వలంటీర్ల శిక్షణలకు, ఇతర శాఖాపరమైన కార్యక్రమాలను ఇక్కడ నిర్వహించేవారు. ఇది కొంతదూరంగా ఉందనే కారణంతో కొన్నాళ్లకు కార్యకలాపాలను ఇక్కడ్నుంచి చుంచుపల్లి ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరం, బాబుక్యాంప్‌లో నిర్మించిన ఎంఈవో కార్యాలయాలకు మార్చారు. ఈ నిర్ణయంతో కొన్నేళ్లుగా భవనం నిరుపయోగంగా మారింది. కొంతకాలం కొత్తగూడెం సహకార శాఖకు చెందిన ఎరువుల నిల్వలు ఏర్పాటు చేసుకొనేందుకు వినియోగించుకొన్నారు. ప్రస్తుతం గృహాల మధ్యనున్న భవనం శిథిలావస్థకు చేరుతోంది. కొందరు యువత అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. రాత్రి సమయాల్లో గంజాయి, మందుబాబులు తిష్ఠ వేస్తున్నారు. ఇక్కడ భూములకు ధరలు పెరగడంతో కబ్జా ప్రమాదమూ పొంచిఉంది. విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి ఎమార్సీ సెంటర్‌ను ఏదైనా ప్రజా సేవ అదించేలా సద్వినియోగంలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

వినియోగంలోకి తెచ్చేందుకు కృషి..

ఈ సమస్యను చుంచుపల్లి మండల విద్యాధికారి 'బాలాజీ' దృష్టికి 'న్యూస్‌టుడే' తీసుకెళ్లగా... 'నేను ఇటీవల బాధ్యతలు చేపట్టాను. భవనం నిరుపయోగంగా ఉన్న మాట నిజమే. ఈ విషయాన్ని వెంటనే డీఈవో దృష్టికి కూడా తీసుకెళ్లాను. చుట్టూ ప్రహరీ నిర్మించి విద్యాశాఖ గోదాం, ఇతర శిక్షణ కార్యక్రమాలకు వినియోగించేలా చర్యలు తీసుకొంటాం' అని అన్నారు.